# సమర్థ సద్గురు

అక్టోబరు 2026

ఆధ్యాత్మిక మాసపత్రిక

వెల : రూ. 10.00



# జులై 8 నుండి 21 వరకు శ్రీమాతాజీవారి యునైటెడ్ కింగ్‌డమ్ పర్యటన - త్రయాహ్నిక దీక్షా కార్యక్రమ దృశ్యములు









# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



**సంపాదక వర్గము**

డా॥ యమ్. స్వర్ణముఖి
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ
సన్నిధానం కాళీమాత



సంపుటి 46 సంచిక 2
పేజీలు 44
అక్టోబర్ 2026

5సం॥ల చందా రూ. 500
2సం॥ల చందా రూ. 240
సంవత్సర చందా రూ. 120
విడిప్రతి వెల...... రూ. 10

బ్యాంక్ డ్రాఫ్ట్ Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed & Published by
Paluri Siva Rama Kali Prasad
on behalf of
YOGINI SRI CHANDRA
KALI PRASADA MATHAJI
CHARITABLE TRUST
and Printed at
Nagendra Enterprises,
D.No.24-7-8, Sandeep Mansion
Jonnavittula Vari St.
Gandhi Nagar, Vijayawada
N.T.R. Dist., Andhra Pradesh.
Published at
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh, Editor
PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో** ............................. ....... **పేజీ**


శ్రీ కాళీ ప్రసాద శతకము .................... ..........4
శ్రీబాబూజీ ఉవాచ....... ....... ..... ......... ............ 5
అమ్మమాట.......................................... ................. ..........6
ప్రంబనన్ ఆలయాలు........................................ ....7
భగవద్గీత సాధన దీపిక ........................................9
మనస్సు - బుద్ధి ........................... .............. ..........11
శ్రీకృష్ణ కర్ణామృతం ...............................................13
అహింసా భావము............. .................... ................14
శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద్ బాబూజీ మహరాజ్ వారి సహస్ర నామావళిః ........ ...................................... 17
శ్యామ సుందరా! ఒక్కసారి, ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ! ..19
నారద భక్తి సూత్రములు ................ ...............21
శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు.....24
మాయా విలాసం............................ ..................25
పిలుపు ........................................................................27
నిరీక్షణ .......................................................................30
శ్రీ గురుగీత .......................................... .................32
గురుకృప ........................................ ........................34
సమర్థ సద్గురునాథుని దివ్యచరిత్ర.....36
ఆధారం .......................................................................38
విష్ణు కథలు ...... ............................ ....................41

## శ్రీ కాళీ ప్రసాద శతకము - పాలూరి ప్రసాద్

17. ***చిటారు కొమ్మను గల ముక్తి***
***ఫలమును బొంద రెక్కలు***
***రెండు నవి భక్తి వైరాగ్యంబులు***
***కాళీ ప్రసాదు మాట కాంతిబాట ॥***



తా: ఒక చెట్టు చిటారు కొమ్మన ఉన్న ఫలాన్ని అందుకోవాలంటే చెట్టు ఎక్కడమో, నిచ్చెన వంటి సాధనాలను ఉపయోగించడమో కుదరదు. అది కేవలం రెండు బలమైన రెక్కలు గల పక్షికి మాత్రమే అందుతుంది. అలాగే సంసారమనే ఈ అశ్వత్థ వృక్షానికి చిటారు కొమ్మన ఉన్న ముక్తిఫలాన్ని అందుకోవటానికి మనకు కూడా రెండు బలమైన రెక్కలు అవసరం. అవే భగవంతునిమీద అచంచల విశ్వాసము, ప్రగాఢ భక్తి. ఈ రెండు రెక్కలు బలంగా ఉన్నప్పుడే మనం సునాయాసంగా ఎగిరి ఆ ముక్తిఫలాన్ని అందుకొని అనుభవించగలం.

1) నిజమైన దాస్యభావన అంటే ఏమిటి?
2) మృత్యుంజయుడు తనకు తానే బిందెలతో అభిషేకము చేసుకుంటున్నట్లుగా అనుభూతిని ఎవరు పొందారు?
3) ఒక్క రాత్రిలో 1000 ఆలయాలను నిర్మించినదెవరు?
4) తనుమనధనములనే కాక దారాపుత్రాదులను కూడా గురుదేవులకు సమర్పించాలని ఎందుకు చెప్పారు?
5) సూక్ష్మబుద్ధికి, స్థూలబుద్ధికి తేడా ఏమిటి?
6) చిన్న వయసులోనే సాధన ఎందుకు చెయ్యాలి?
7) ఆత్మ గురించి మళ్ళీ మళ్ళీ ఎందుకు చెప్పుకోవాలి?
8) రైలు క్రింద పడిన కృష్ణదాసుగారు ఎలా బ్రతికారు?

***సమాధానాలు లోపలి పేజీలలో..........................***

# శ్రీ బాబూజీ ఉవాచ - కీ.శే. పరాశర ప్రసాద్

11-11-1981

ఈరోజు ఉదయం వాకింగ్ చేస్తూండగా శ్రీ బాబూజీ దర్శనార్థం ఒక భక్తుడు క్రింద నిలుచుని ఉన్నాడు. ఆ వ్యక్తిని ఉద్దేశించి శ్రీ బాబు 'ఏమిటి నిన్నరాత్రి నీ దగ్గరకి కుక్క వచ్చినపుడు నా దగ్గర ఏమీ లేదు ఫో! అన్నావెందుకు? అలా అన్నావా లేదా?' అని ప్రశ్నించారు. ఆ వ్యక్తి 'అన్నాను బాబు' అన్నాడు. 'నీ దగ్గర ఏమీ లేదా! అసత్యం. ఏమీ లేకపోతే ఇక్కడికి ఎందుకు వచ్చావు?' అన్నారు శ్రీ బాబు. ఆ వ్యక్తి సమాధానం చెపుతూ 'మీ మీద మమకారం కొద్దీ వచ్చాను బాబూ!'అన్నారు.



'నామీద అంత మమకారం ఉంటే ఇక్కడే ఉండిపోరాదూ?' అన్నారు శ్రీ బాబు. ఆ వ్యక్తినుండి సమాధానం రాలేదు. శ్రీ బాబే మాట్లాడుతూ 'సమాధానం లేదు కాబట్టి అది అసత్యం అన్నమాట. అహం అనేది చాల గొప్పది. నేను, నాది అనే అహంకారాన్ని వదలి అసలు వస్తువైన అహాన్ని తెలుసుకుంటే ఇంక తెలుసుకో వలసినది ఉండదు. అదే ఆత్మవస్తువు. దాంట్లో నిత్యానందమే మిగులుతుంది. అది అనుభవించవలసిందే గాని వ్యక్తం చేసేదికాదు. ఉప్పుబొమ్మ నీటిలోతు తెలుసుకుందామని నీటిలోపడితే ఏమవుతుంది? నీటిలోతు తెలుస్తుందా? దానిలో లీనమైపోతుంది. భగవంతుడిని సంకీర్తనద్వారా, ధ్యానంద్వారా ఎలాగైనా సేవించవచ్చు. కాని మీ సాధన శరీరంలో పటుత్వం ఉన్నపుడే సాధ్యపడుతుంది.

మాతృగర్భంలో ఉన్నపుడు ఏమీ చేయలేని స్థితి. బాల్యంలో ఆటపాటలతో సరిపోతుంది. యవ్వనంలో చెప్పనక్కరలేదు. మరి వార్ధక్యంలో మీ నిజ అస్థిపంజరాన్నే మోయలేని స్థితిలో ఇంక సాధన ఏం చేస్తారు?

మనస్సు అనే మాయాశక్తి అనిత్యమైన జగత్తు సత్యమని నమ్మిస్తుంది. నిత్యమైన బ్రహ్మామును దర్శింపనివ్వదు. 'బ్రహ్మ సత్యం జగత్తు మిధ్య' అనే సత్యాన్ని తెలుసుకోవాలి. అప్పుడు 'యద్దృశ్యం తన్నశ్యం' అనేది ఋజువవుతుంది. ఈ గోచరించేదంతా అసత్యమని తెలుసుకుంటాడు. మనస్సు అద్దం వంటిది. మనస్సు ఏ గుణాన్నయితే కలిగి ఉంటుందో అదే ప్రతిబింబము కానవస్తుంది. అదే యథార్థమని నమ్మిస్తుంది. మనస్సుని పరమాత్మకి సమర్పించిన వాని వద్ద ఏముంటుంది? ఆనందం తప్ప' అన్నారు.

# అమ్మ మాట

- జపమాలా ప్రసాద

## అందరికీ అభయమ్మునిచ్చు చేయి

"భగవంతుని లీలలు అనంతమైనవి. అవి మన ఊహకి అందేవికావు. ఆ లీలలని గ్రహించడమే మానవుడు చేసే సాధన. సృష్టికర్తయైన భగవంతుడు అన్నింటా తానే నిండివుండి మనకి ఆనందాన్ని ప్రసాదిస్తున్నాడు. తల్లిగా, తండ్రిగా, గురువుగా, స్నేహితులుగా, అందరిలోనూ తానే నిండి, మనకి అనేక విధాలుగా సాయపడుతున్నాడు, ఆనందాన్ని ఇస్తున్నాడు. కానీ మానవుడది గ్రహించక అంతా తన ప్రజ్ఞే అనుకుని విర్రవీగుతాడు. భగవంతుడు మనకి ఏ రూపంగానైనా, ఏ సమయంలోనైనా వచ్చి సహాయపడవచ్చు.



కృష్ణదాస్‌జీ అనే కృష్ణ భక్తుడొకసారి, నేపాల్‌కి వెళ్తూ, దారిలో ఒక స్టేషన్‌లో రైలు దిగి, కాఫీ సేవిస్తూండగా, రైలు కదలనారభించింది. ఆయన మరో గుమ్మం ద్వారా రైలెక్కడానికి ప్రయత్నిస్తూ వుండగా, కాలుజారి రైలు చక్రాల క్రింద పడిపోయాడు. కానీ ఆయన యొక్క సంస్కారబలం వల్ల, యీ హఠాత్ సంఘటనకి యే మాత్రం వెరవక, 'ప్రభూ! నాకింత సునాయాస మరణం ప్రసాదిస్తున్నావా!' అని ఆనందంలో వుండిపోయాడు. ఏవో రెండు బలమైన బంగారు చేతులు అతనిని ప్రక్కకి తోసివేశాయి. రైలు కూడా ఆగింది. ఆయనని గార్డు వచ్చి తీసుకుని వెళ్ళి తన పెట్టెలో ప్రయాణం చేయించాడు. ఆయన తన స్వగ్రామం వెళ్ళాక, అందరికీ తన అనుభవం చెప్పేసరికి వారంతా 'అది ఆ కృష్ణుడి దయయే' అని అన్నారు. మన కృష్ణదాసు బాలకృష్ణుడిని కొలుస్తాడు. ఆయనలో ఆ రూపం ముద్ర వేసుకుంది కనుక, తనని రక్షించిన ఆ చేతులు బాలకృష్ణుడివి కావే, మరి ఎవరివి? అనే ప్రశ్న మిగిలిపోయింది. ఇలా వుండగా, ఆయనొకసారి తిరుపతి వెళ్ళడం, అక్కడ ఆ వేంకటేశ్వరుని యొక్క శంఖు చక్రములను ధరించిన బంగారు చేతులను చూడటం జరిగింది. తనని ఆనాడు రక్షించినవి ఆ చేతులే అని గుర్తించాడు. కానీ మళ్ళీ మరొక సందేహం పొడ సూపింది – తనని రక్షించిన చేతులలో శంఖు, చక్రాలు లేవుగా అని! అప్పుడు తన వద్దనున్న స్నేహితుడు, ఆనాడు గజేంద్రుడ్ని రక్షించడానికి ఆయన శంఖు చక్రాలని వదిలివెళ్ళాడని చెపుతూ, తన భక్తులని సంరక్షించే సమయంలో ఆయన సర్వం మరచిపోతాడని గుర్తు చేసేసరికి, కృష్ణదాసుగారి సంశయాలన్నీ పటాపంచలై, ఆనందాంబుధిలో ఓలలాడాడు.

చూశారా! అలా వుంటాయి ఆ భగవంతుని లీలలు! ఆయన ఏ రూపమైనా ధరించవచ్చు. అన్ని రూపాలూ ఆయనవే. అట్టి సర్వశక్తిమంతుడైన భగవానుని దివ్యలీలలని స్మరించుకుంటూ, ఆయన యొక్క కృపకి సర్వులూ పాత్రులగుదురు గాక!"

# ప్రంబనన్ ఆలయాలు

సన్నిధానం కాళీమాత

ఒకప్పుడు అఖండ భారతంలో భాగంగా వున్న ఇండోనేషియా దేశంలోని ఈ ప్రంబనన్ ఆలయ సమూహములు భారతీయ హిందూ వారసత్వానికి ప్రతీకలు. పూర్వకాలంలో అనగా 9, 10, శతాబ్దాల మధ్య నిర్మించబడిన ఈ దేవాలయాలు గురుతత్వానికి ప్రతీకలైన, హిందూ త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకై నిర్మింపబడినవి. కాని, వీటి సమూహాన్ని 'ప్రంబనన్' అని అంటారు. అయితే ఈ ప్రంబనన్ అనేది 'పరబ్రహ్మన్' అనే పదానికి అపభ్రంశం చెందిన రూపము. గురుబ్రహ్మ పదం పూర్తిగా – గురుబ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః గురుస్సాక్షాత్ పరబ్రహ్మ. ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈ ఆలయం వున్న ప్రదేశం యోగ్యకర్త అనే నగరానికి సమీపంలో వుంటుంది. అంతరార్థంలోకి వెళ్ళి విచారణ చేస్తే, అనేకమైన నిగూఢ విషయాలు తెలుస్తాయి.

ఈ ఆలయాల సముదాయంలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు మూడు ఎత్తైన దేవాలయాలు వున్నాయి. అందులో అన్నిటికంటే ఎత్తైనది శివాలయం. ఇది 47 మీటర్ల ఎత్తులో ఆ ప్రదేశం అంతటా ఆధిపత్యం వహిస్తుంది. శివ ఏవ గురు కదా! ఇందులో దుర్గ, గణేశ, అగస్త్య మహర్షి విగ్రహాలు వున్న ఉపాలయాలు వున్నాయి. ఈ ఆలయ సముదాయం మొత్తం 40 హెక్టార్ల భూమిలో 240 పైన ఆలయాలు వున్నాయి. ఆలయాల చుట్టూ వున్న గ్యాలరీలలో భారతీయ ఇతిహాసమైన రామాయణంలోని ఘట్టాలు వర్ణించే విధంగా వుండటం వలన సందర్శకులు ఆలయ కారిడార్‌లో చుట్టూ సవ్యదిశలో నడుస్తూ రామాయణ కథనాన్ని అనుసరిస్తారు. ఈ ఆలయ సముదాయం బహిరంగ ప్రదేశంలో నేటికీ రామాయణం ఖ్యాతి నాటక ప్రదర్శన జరుగుతూనే వుంటుంది.

ఆ ఆలయం యొక్క మూలాలు పురాణాలకు సంబంధించినది అయినప్పటికీ ఒక జానపద కథ కూడా దగ్గర సంబంధం కలిగి వుంది. జావానీస్ గాధ ప్రకారం, ఒక యువరాణి పేరు రోరో జోంగ్రాంగ్. ఆమె రాజ్యాన్ని ఒక యుద్ధ వీరుడు బుండుంగ్ బోండోవోసో అనే పేరుగలవాడు జయిస్తాడు. అతడు రాజ్యాన్ని చేపట్టడమే కాక, ఆ రాజకుమారిని పెళ్ళి చేసుకోమని నిర్బంధిస్తాడు. అతడిని వివాహం చేసుకోవడం ఇష్టం లేని ఆ రాజకుమార్తె ఒక్క రాత్రిలో తన రాజ్యంలో వేయి (1000) దేవాలయాలు నిర్మించమని సవాలు చేస్తుంది.

అనేక అతీంద్రియ శక్తులు కలిగిన ఆ వీరుడు తన స్వాధీనంలో వున్న ఆత్మలతో ఆ పని దాదాపు పూర్తి చేస్తాడు. అతడిని ఆ పని చేయకుండా ఆపటానికి యువరాణి

గ్రామస్తులను తెల్లవారిపోతోంది అనే అపోహ కలిగేలా అందరినీ ఇళ్ళల్లో మంటలు వెలిగించి, వంటకు అవసరమైన ధాన్యం దంచడం వంటి పనులు చేయమని చెబుతుంది. దానితో తెల్లవారుఝాము అయిందని నమ్మిన ఆత్మలు ఆఖరి దేవాలయం పూర్తి కాకుండానే అదృశ్యమై పోతాయి. దానికి కోపించిన ఆ వీరుడు ఆ 1000వ ఆలయంలో ఆమెనే విగ్రహంగా వుండమని శపిస్తాడు. ఆమె ఆ దేవాలయంలో రాతి విగ్రహంగా మారిపోతుంది. స్థానికులు వారి సాంప్రదాయం ప్రకారం శివాలయంలో వున్న దుర్గ విగ్రహం ఆ యువరాణిదే అని భావిస్తారు.

2006వ సం.లో యోగ్యకర్త నగరానికి వచ్చిన భూకంపం కారణంగా ఈ ఆలయాలు అన్నీ చాలా దెబ్బతిన్నాయి. ఇప్పుడు మన భారత ప్రభుత్వ చొరవతో ఈ దేవాలయాలు అన్నీ ఇండోనేషియా దేశం వారి సహాయ సహకారాలతో పునరుద్ధరింప బడుతున్నాయి. ఇలా ప్రపంచ నలుమూలలా మన సనాతన ధర్మం విస్తరించడం మనకెంతో గర్వకారణం. ఆదిపూర్ణుడు గురుపరమేశ్వరుడు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్ శాఖ వారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......

అక్టోబర్ 2026

5 సోమ: శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.
11 ఆది: శ్రీ దేవీ శరన్నవరాత్రి ప్రారంభం
20 మంగళ: విజయదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.
26 సోమ: ఆశ్వయుజ పూర్ణిమ – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

నవంబర్ 2026

4 బుధ: శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.
7 శని: నరకచతుర్దశి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన
8 ఆది: దీపావళి పండుగ – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన
13 శుక్ర; నాగుల చవితి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.
20 శుక్ర; చిలుక ఏకాదశి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.
21 శని: క్షీరాబ్ధి ద్వాదశి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.
24 మంగళ: (కార్తీక)–గురుపూర్ణిమ. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.
27 శుక్ర; కార్తీక బహుళ తదియ – శ్రీ సద్గురుదేవుల 38వ వార్షిక పుణ్యారాధన ప్రారంభం.

# భగవద్గీత సాధన దీపిక

(గత సంచిక తరువాయి) - కీ.శే. శ్రీ గూడా శివ రామమూర్తి

**23.** **నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః**
**న చైనంక్లేద యంత్యాపో నశోషయతి మారుతః ॥**

**24.** **అచ్ఛేద్యోఽయ మదాహ్యోఽయ మక్లేద్యోఽ శోష్య ఏవ చ**
**నిత్య స్సర్వగత స్థాణు రచలోఽయం సనాతనః ॥**

**25.** **అవ్యక్తోఽయ మంచిత్యోఽయ మవికార్యోఽయ ముచ్యతే**
**తస్మా దేవం విదిత్వైనం నాను శోచి తుమర్హసి ॥**

శ్రీకృష్ణ భగవానుడు "అర్జునా! ఈ ఆత్మను శస్త్రములు ఛేదించలేవు. అగ్ని దహించలేదు. నీరు తడపలేదు. గాలి ఎండించలేదు. ఈ ఆత్మ కోయ దగినది గాని కాల్చతగినది గాని కాదు. తడుప దగినదిగాని, ఎండబెట్ట దగినదిగాని కాదు. ఇది నాశనము లేనిది. శాశ్వతమైనది. ఎక్కడా ఒక్కఅణు మాత్రం అయిన ఖాళీ లేకుండా, ఇది అంతటా నిండి ఉన్నది. ఇది స్థాణువు వలె స్థిరమైనది. ఇది చలనం లేకుండా అచలంగా ఉన్నది. ఈ ఆత్మచిరంతనమైనది. ఈ ఆత్మ ఇంద్రియ గోచరం అయ్యేదికాదు. దానిని ఊహించటానికి కూడ శక్యంకాదు. అది ఏ విధమైన వికారమూ చెందేదికాదు. ఈ విధముగా ఆత్మను గురించి తెలుసుకొని నీవు విచారించటం మాను" అన్నాడు.



కర్తృత్వ - భోక్తృత్వాభిమానాలు, కామక్రోధాలు, రాగద్వేషాలు మొదలైనవన్నీ జీవులకు వారివారి ప్రారబ్ధాన్ని అనుసరించి కలుగుతుంటాయి. ఇవి కేవలం సముద్రం పైనకనపడే అలలవంటివి. సముద్రంపైన అలలు చలిస్తూ ఉన్నా, సముద్రం మాత్రం, నిశ్చలంగా, గంభీరంగా ఉంటుంది. అదే విధంగా దేహేంద్రియాదులకు కర్తృత్వ - భోక్తృత్వాభిమానాలు కలుగుతూ ఉన్నా, కూటస్థమైన ఈ ఆత్మమాత్రం, నిశ్చలంగా సాక్షిగా ప్రకాశిస్తూ ఉంటుంది.

ఈ ఆత్మను గురించి చెప్పిందే మళ్ళీ మళ్ళీ చెప్పటం దేనికి అని నీవు భావించవద్దు. శంకర భగవత్పాదాచార్యుల వారు కూడా ఇది అవసరం అని, ఆధ్యాత్మిక జగత్తులో పునశ్చరణ యొక్క ఆవశ్యకతను ఇది నిరూపిస్తున్నది అని సెలవిచ్చారు.

సత్య పదార్థము మన నిత్య జీవితంకంటె ఎంతో భిన్నమైనది. అతీంద్రియమైనది. ఇది ఎంత అతీంద్రియమైనది అంటే, నీవు మరల మరల పునశ్చరణ చేస్తేగాని దానిని దర్శించలేవు. ఆవృత్తి, అభ్యాసము యొక్క విలువను దీనిని బట్టి నీవు గ్రహించుకో. నీకు ఈ జగత్తు అంతా అసత్తు, బ్రహ్మవివర్తం, భగవంతుడి లీల అనే ఎఱుక నిరంతర ధ్యానం వలనగాని సిద్ధించదు. నిరంతర నిదిధ్యాసనముల వలనగాని నిలబడదు. నీవు సత్యాన్ని స్వానుభవంతో అపరోక్షంగా తెలుసుకొనేవరకు సాధన చేస్తూనే ఉండాలి.

వ్యాసభగవానుడు దీనిని పునఃపునః చెప్పారంటే దానికి కారణం ఇది అతీంద్రియమైనది, అవాఙ్మానస గోచరము, అత్యంత గహనమైనది, మరల మరల విన్న తరువాత, జపము చేసిన తరువాత కూడ, గుర్తుంచుకోవాలంటే కష్టమైనది కావటమే. నిత్య జీవితానికి సంబంధించిన నీ అజ్ఞానం ఎంత బలీయమైనదంటే, అది నీ గ్రహణశక్తిని, అర్థం చేసుకొనే శక్తిని, తనశక్తితో వెల్లువలా ముంచెత్తుతుంది.

నీవు ఆత్మను తెలుసుకున్నావు అనుకునేదానికి వీలులేదు. నీవు చేస్తున్నదల్లా, ఆత్మను గురించిన సమాచారాన్ని సేకరించటం మాత్రమే. ఏదో చరిత్రలాగానో, లేదా భూగోళ శాస్త్రంలాగానో, ఆర్థికశాస్త్రంలాగానో ఆత్మను గురించి తెలుసుకుంటే నీవు కేవలం ఒక వాచా పండితుడవు మాత్రం అవుతావు. అంతేతప్ప నీవు ఆత్మజ్ఞానివి కాలేవు.

అలా నీకు కలిగే పాండిత్యం భగవత్సాక్షాత్కారానుభవం వలనకాని, లేదా అపరోక్షానుభూతి వలన గాని, కలిగే జ్ఞానం కాదు. ఆత్మ, లేదా బ్రహ్మమునకు సంబంధించిన ఎఱుక జ్ఞానయోగం వలన మాత్రమే సాధ్యం.

- సశేషం

# మనస్సు - బుద్ధి

- కే.శే. పరాశర ప్రసాద్

మానవుని వ్యక్తిత్వము, ప్రవర్తన, భాషణ మరియు అతను నిర్వహించే క్రియలు అతని అంతఃకరణలోని ప్రధాన పాత్రలైన మనస్సు, బుద్ధిల పరస్పర సమన్వయ స్పందనపై ఆధారాపడి వుంటాయి. అదే మానవుడి జీవితంలోని ప్రశాంతతకి దోహదం చేస్తుంది. మనస్సు సంకల్పాల సంపుటి. అది మానవుడి భావనా పరంపరలకు నిలయం. ఇది సమస్త జీవరాశులకు వర్తిస్తుంది. అయితే జంతువుల యందు మనస్సులో ఉదయించిన సంకల్పము, లేక భావము నేరుగా క్రియారూపము దాలుస్తుంది. ఎందుకంటే మనస్సులో జనించిన సంకల్పము, లేక భావనను విచారణ చేసి, నిర్ణయించే బుద్ధి లోపించటమే.

మానవుడు ఒక్కడే వివేకవంతమైన నిర్ణయాన్ని చేయగలిగిన బుద్ధి కలిగి వుండి, మనస్సులో ఏ భావన కలిగినా అది క్రియా రూపము దాల్చటానికి నిర్ణయాత్మక బుద్ధి ప్రధాన పాత్రను పోషిస్తుంది. అందువలనే మనస్సులో జనించిన సంకల్పాలన్నీ క్రియారూపమును దాల్చక సమసి పోతాయి. మానవుడి మనస్సులో క్షణికోద్రేకముతో ఉద్భవించిన భావనా పరంపరలన్నింటికీ దాస్యం చేయకుండా బుద్ధి అడ్డుపడుతుంది. అందుకే భగవంతుని సృష్టిలోని జీవరాశులన్నిటికన్నా మానవ జన్మ ఉత్కృష్టమైనది. మానవునికి భగవానుడు ప్రసాదించిన బుద్ధీంద్రియము అతని జీవిత సమస్యలను విశ్లేషించి, విచారణ చేసే, వివేకవంతమైన, నిర్ణయాత్మక దృష్టిని కలిగి వుంటుంది. అదే మానవుని సంస్కారము. దాని ద్వారా అతనిలోని అత్యున్నత వ్యక్తిత్వము మనస్సులో జనించిన నీచ భావాలకు, నీచ ప్రవృత్తికి, ఉద్రేకపూరిత మనస్తత్వానికి దాస్యం చేయకుండా కాపాడుతుంది.

అయితే భగవానుడు తనకు ప్రసాదించిన బుద్ధీంద్రియాన్ని సద్వినియోగం చేసుకోకపోతే, అటువంటి వ్యక్తి ద్విపాద పశువుగా పరిగణింపబడతాడు. అందువలన మానవుడు తన జీవితంలో ఎదుర్కునే కష్టనష్టాలకు తానే బాధ్యత వహించవలసి వస్తుంది. మనస్సు బుద్ధి అనేవి అంతఃకరణలోని విభిన్న కరణములు. మనస్సు బుద్ధీంద్రియాన్ని అధిగమించి తనకు అనుకూలంగా మలచుకుని, తనలో ఉద్భవించిన భావాలన్నిటినీ క్రియారూపం దాల్చే అవకాశం వుంది. మనస్సుని ఆఫీసులోని ఒక గుమాస్తాతో పోల్చవచ్చు. ఆ గుమాస్తాకు తాను చేయవలసిన పనుల గురించిన సందేశాలు అనేకం వస్తాయి. అయితే ఆ గుమాస్తా తనకు వచ్చిన సందేశాలన్నింటిని ఆ ఆఫీసులోని అధికారికి సమర్పించి, అతని నిర్ణయానికి వదిలివేయటం

పరిపాలనలోని సౌలభ్యం. అలాగే మనస్సు కూడా తనలో ఉద్భవించిన సంకల్పాలు, భావనలను బుద్ధికి నివేదించి, దాని నిర్ణయానికి వదిలివేస్తే అది వివేకవంతమైన నిర్ణయమే అవుతుంది.

ఒక నదిలోని నీటి ప్రవాహం దానికి ఇరువైపులా వున్న కరకట్ట ధృడత్వంపై ఆధారపడి వుంటుంది. కరకట్ట ధృడంగా లేకపోతే నీటి ప్రవాహం కరకట్టను ఛేదించుకుని అటు ఇటు పొరలిపోతుంది. అలాగే నిర్ణయాత్మక బుద్ధి ధృడమైన స్వభావం కలిగి వుంటే మనస్సు అదుపులో వుంటుంది. అయితే బుద్ధీంద్రియము యొక్క నడవడిక సద్గురుమూర్తి ఆధీనంలో వుంటుంది.అందువలన బుద్ధి ఉత్తేజితమై సక్రమమైన మార్గంలో నడవాలంటే సద్గురుమూర్తి సమాశ్రయము ద్వారా సూక్ష్మాతి సూక్ష్మమై మనస్సుని సత్యమార్గంలో నడిపిస్తుంది. సూక్ష్మబుద్ధి మాత్రమే వివేక దృష్టిని కలిగి వుండి సత్యాసత్య వివేకముతో సరియైన నిర్ణయాన్ని తీసుకోగలుగుతుంది. సాధారణ మానవులందరిలో ఉన్న స్థూల బుద్ధి మనస్సుకు అనుకూలంగా బాహ్య ప్రపంచంలో ప్రాపంచిక వ్యవహారాలలో తలమునకలై వుంటుంది.


## సమర్థ సద్గురు మాసపత్రిక వారి విన్నపము

ఉదార దాతల సహకారంతో గత కొన్ని సంవత్సరాలుగా సమర్థ సద్గురు తెలుగు మాసపత్రిక తెలుగు రాష్ట్రాలలోని అనేక గ్రంథాలయాలకు చేరుతూ, అనేక మంది పాఠకులకు జ్ఞానసేవ అందిస్తోంది. ఈ గ్రంథాలయ చందాలలో చాలావాటి గడువు త్వరలో ముగియనున్నందున, ఈ సేవ నిరంతరాయంగా కొనసాగేందుకు భక్తులు, పాఠకులు విరాళాలతో ముందుకు రావలసిందిగా మనవి.

అలాగే, పుట్టినరోజులు, వివాహాలు, వివాహ వార్షికోత్సవాలు, గృహప్రవేశాలు వంటి శుభ సందర్భాలలో మీ బంధుమిత్రులకు బహుమతి చందాలు (Gift Subscriptions) అందించి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచండి.

మీ సహకారం అనేక మంది పాఠకులకు జ్ఞానదీపంగా నిలుస్తుంది. ఈ సేవకు సంబంధించిన వివరాల కోసం: 8333808310.

# శ్రీ కృష్ణ కర్ణామృతము

- కీ.శే. సుశీలా ప్రసాద

**సాయంకాలే వనాన్తే కుసుమిత సమయే సైకతే చన్ద్రికాయామ్।**
**త్రైలోక్యాకర్షణాంగం సుర నర గణికా మోహనా పాంగ మూర్తిమ్।**
**సేవ్యం శృంగారభావైర్నవరస భరితైర్గోపకన్యా సహస్రై।**
**ర్వన్దేఽ హం రాసకేళీరత మతిసుభగం వశ్యగోపాలకృష్ణమ్॥**

తాత్పర్యము -

వసంత కాలమందు రమణీయమగు యమునా తీరమందు, ఇసుక తిన్నెల యందు, సాయంకాలమందు, వెన్నెల కాయుచుండగా, మూడు లోకములను వశ పరచుకొనెడి అవయవములు కలవాడు, దేవ మానవ గణములకు మోహమును పుట్టించునట్టి కడకన్నులు కలవాడు, నవ రసములతో నిండిన వేలకొలది గోప కన్నెకల చేత శృంగార భావముతోడ సేవింప తగినవాడు, రాసక్రీడయందు ఆసక్తిలవాడు, మిక్కిలి సౌందర్యము కలవాడు ప్రేమ భక్తి భావములు గలవారికి వశుడైన ఆ గోపాల కృష్ణునికి నేను నమస్కరిస్తున్నాను.



***నిజమైన సత్యగురువు లభ్యమయినప్పుడు జన్మాంతర వాసనలన్నీ పటాపంచలవుతాయి. పరిపూర్ణమైన ఆనందం, సంపదైశ్వర్యాలు సంప్రాప్తమవుతాయి. సత్యగురువు కృపా వీక్షణాలు సదా ప్రసారమయ్యే గృహం ఆనందదాయకమే అవుతుంది.***

- శ్రీ కాళీబాబు

(గత సంచిక తరువాయి) **అహింసా భావము** సేకరణ - మురళి

గౌతమి కథ – కిశాగౌతమి అనే యువతి, ఒక ఐశ్వర్యవంతుడి ఏకైక కుమారుడిని వివాహం చేసుకుంది. వారికి ఒక మగబిడ్డ జన్మించాడు. ఆ బాబుకి రెండేళ్ల వయసు ఉన్నప్పుడు మరణించాడు. కిశాగౌతమికి ఆ బిడ్డపై అమితమైన అనురాగం ఉండేది. ఆమె ఆ చనిపోయిన బిడ్డను గుండెలకు హత్తుకుని, బిడ్డను బ్రతికించడానికి ఏదైనా మందు ఇవ్వమని తన స్నేహితులు, బంధువుల ఇళ్ళ చుట్టూ తిరిగింది.

ఒక బౌద్ధ సన్యాసి ఆమెతో : "ఓ అమ్మాయీ! నా దగ్గర ఎటువంటి మందూ లేదు. కానీ నువ్వు బుద్ధ భగవానుడి దగ్గరకు వెళ్ళు. ఆయన తప్పకుండా నీకు చాలా మంచి మందు ఇవ్వగలరు. ఆయన కరుణాసముద్రుడు. నీ బిడ్డ మళ్ళీ బతుకుతాడు. బాధపడకు" అన్నాడు.

ఆమె వెంటనే బుద్ధుడి దగ్గరకు పరుగున వెళ్ళి, "ఓ పూజ్యులైన స్వామీ! ఈ బిడ్డకు మీరేదైనా మందు ఇవ్వగలరా?" అని అడిగింది. బుద్ధుడు ప్రత్యుత్తరమిస్తూ, "అలాగే, నేను నీకు చాలా మంచి మందు ఇస్తాను. ఏ ఇంట్లోనైనా ఒక బిడ్డ కానీ, భర్త కానీ, భార్య కానీ, తండ్రి కానీ, తల్లి కానీ లేదా సేవకుడు కానీ మరణించని ఇల్లు చూసి, అక్కడి నుండి కొద్దిగా ఆవాలు తీసుకురా" అన్నారు. ఆమె, "చాలా మంచిది స్వామీ, నేను కొద్దిసేపట్లోనే తీసుకువస్తాను" అని చెప్పింది.

తన చనిపోయిన బిడ్డను గుండెలకు హత్తుకుని, కిశాగౌతమి ఒక ఇంటికి వెళ్ళి కొద్దిగా ఆవాలు కావాలని అడిగింది. ఆ ఇంటివారు, "ఓ అమ్మా, ఇవిగో ఆవాలు, తీసుకో" అన్నారు. కిశాగోతమి వారిని, "మీ ఇంట్లో ఎవరైనా కొడుకు, భర్త, భార్య, తండ్రి, తల్లి, లేదా సేవకుడు చనిపోయారా?" అని అడిగింది. వారు, "ఓ అమ్మా! నువ్వు చాలా వింతైన ప్రశ్న అడుగుతున్నావు. మా ఇంట్లో చాలా మంది చనిపోయారు" అని సమాధానమిచ్చారు.

కిశాగౌతమి మరొక ఇంటికి వెళ్ళి అదే ప్రశ్న అడిగింది. ఆ ఇంటి యజమాని, "నేను నా పెద్ద కొడుకును, నా భార్యను కోల్పోయాను" అని చెప్పాడు. ఆమె మూడవ ఇంటికి వెళ్ళింది. ఆ ఇంటివారు, "మేము మా తల్లిదండ్రులను కోల్పోయాము" అని సమాధానమిచ్చారు. ఆమె ఇంకొక ఇంటికి వెళ్ళింది. ఆ ఇంటి మహిళ, "గతేడాది నా భర్త చనిపోయారు" అని చెప్పింది. చివరికి, ఏ ఒక్కరూ మరణించని ఒక్క ఇల్లు కూడా కిశాగౌతమికి దొరకలేదు. దాంతో ఆమె మనస్సులో వివేకం, వైరాగ్యం ఉదయించాయి.

ఆమె తన బిడ్డ మృతదేహాన్ని పూడ్చిపెట్టింది. ఈ ప్రపంచంలో పుట్టుక, చావు అనే సమస్యలపై ఆమె తీవ్రంగా ఆలోచించడం ప్రారంభించింది.

ఆ తర్వాత కిశాగౌతమి బుద్ధ భగవానుడి దగ్గరకు వెళ్ళి ఆయన పాదపద్మాలకు నమస్కరించింది. బుద్ధుడు ఆమెతో, "ఓ మంచి అమ్మాయీ! ఆవాలు తీసుకువచ్చావా?" అని అడిగారు. కిశాగౌతమి, "ఎవరూ మరణించని ఒక్క ఇల్లు కూడా నేను కనుగొనలేకపోయాను" అని సమాధానమిచ్చింది.

అప్పుడు బుద్ధుడు "ఈ ప్రపంచంలోని వస్తువులన్నీ నశించిపోయేవే. అవి శాశ్వతం కానివి. ఈ ప్రపంచం దుఃఖాలు, కష్టాలు మరియు బాధలతో నిండి ఉంది. ప్రతి పురుషుడు లేదా స్త్రీ పుట్టుక, చావు, వ్యాధి, ముసలితనం మరియు బాధల చేత ఇబ్బందులు పడతారు. మనం అనుభవం నుండి జ్ఞానాన్ని పొందాలి. జరగని వాటి కోసం, జరగబోని వాటి కోసం మనం ఆశించకూడదు. ఈ దురాశ మనల్ని అనవసరమైన దుఃఖంలోకి, బాధల్లోకి నెడుతుంది. మనిషి నిర్వాణాన్ని పొందాలి. అప్పుడు మాత్రమే అన్ని దుఃఖాలు అంతమవుతాయి. మనిషి అమరత్వాన్ని, శాశ్వతమైన శాంతిని పొందుతాడు" అన్నాడు. ఆ తర్వాత కిశాగౌతమి బుద్ధుని శిష్యురాలిగా మారి, బౌద్ధ సన్యాసినుల సంఘంలో చేరింది.

బుద్ధుని బోధనలు – "మనం దుఃఖానికి గల కారణాన్ని, మరియు దాని నుండి తప్పించుకునే మార్గాన్ని కనుగొనవలసి ఉంటుంది. ఇంద్రియ సుఖాల పట్ల ఉన్న కోరిక (తృష్ణ) మరియు ఈ లౌకిక జీవితంపై ఉన్న వ్యామోహమే దుఃఖానికి ప్రధాన కారణం. మనం గనుక కోరికను సమూలంగా నిర్మూలించగలిగితే, సమస్త దుఃఖాలు, బాధలు అంతమైపోతాయి. మనం నిర్వాణాన్ని లేదా శాశ్వతమైన శాంతిని అనుభవిస్తాము. ఎవరైతే ఆర్య అష్టాంగ మార్గాన్ని (Noble Eightfold Path) ఖచ్చితంగా అనుసరిస్తారో, అనగా---సరైన వీక్షణం (సమ్యక్ దృష్టి), సరైన సంకల్పం (సమ్యక్ సంకల్పం), సరైన వాక్కు (సమ్యక్ వాక్కు), సరైన ప్రవర్తన (సమ్యక్ కర్మ), సరైన జీవనోపాధి (సమ్యక్ ఆజీవనం), సరైన శ్రమ/ప్రయత్నం (సమ్యక్ వ్యాయామం), సరైన ఆలోచన/స్మృతి (సమ్యక్ స్మృతి) మరియు సరైన ఏకాగ్రత/సమాధి (సమ్యక్ సమాధి)---వారు దుఃఖం నుండి విముక్తులవుతారు.

ఓ భిక్షువులారా! తథాగతుడు (బుద్ధుడు) సంపూర్ణంగా గ్రహించిన మధ్యమ మార్గం (Middle Course) ఇదే. ఇది అంతర్దృష్టిని, జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది; ప్రశాంతతకు, అలౌకిక (అతీత) జ్ఞానానికి, పరిపూర్ణ బుద్ధత్వానికి మరియు నిర్వాణానికి దారితీస్తుంది. ఓ భిక్షువులారా! ఇదిగో ఇదే దుఃఖం గురించిన ఆర్యసత్యం. పుట్టుక

బాధాకరం, ముసలితనం బాధాకరం, వ్యాధి బాధాకరం, నచ్చని వాటితో కలయిక బాధాకరం, ఇష్టమైన వాటి నుండి విడిపోవడం బాధాకరం, ఆశించిన కోరిక నెరవేరకపోవడం కూడా తీవ్ర బాధాకరం.

సంక్షిప్తంగా చెప్పాలంటే, ఈ లౌకిక అస్తిత్వంపై వ్యామోహాన్ని పెంచే పంచస్కంధాలు (ఐదు అంశాలు) బాధాకరమైనవి. ఈ లౌకిక అస్తిత్వానికి ముడిపడి ఉన్న ఆ ఐదు అంశాలు ఏవనగా: రూపం (శరీరం/పదార్థం), వేదన (సంచలనం/ అనుభూతి), సంజ్ఞ (గ్రహణశక్తి), సంస్కారం (మానసిక ప్రవృత్తులు) మరియు విజ్ఞానం (చేతన/స్పృహ). ఓ భిక్షువులారా! ఇదిగో ఇదే దుఃఖ కారణం (దుఃఖ సముదయం) గురించిన సత్యం. ఇది మళ్ళీ మళ్ళీ పుట్టేలా చేసే ఒక రకమైన తృష్ణ (ఆరాటం). ఇది ఆనందం, లాలసలతో కూడి ఉండి, ఇక్కడ అక్కడ ఆనందాన్ని వెతుక్కుంటుంది; అంటే, ఇంద్రియ సుఖాల కోసం ఆరాటపడటం మరియు జీవించి ఉండాలనే సహజసిద్ధమైన కోరిక కలిగి వుండటం.

ఓ భిక్షువులారా! ఇదిగో ఇదే దుఃఖ నివారణ (దుఃఖ నిరోధం) గురించిన ఆర్యసత్యం. ఆ తృష్ణ లేదా కోరికను పూర్తిగా నిరోధించడం, అది అస్సలు లేకుండా చేయడం, దానిని వదిలివేయడం, త్యజించడం, దాని నుండి విముక్తి పొందడం మరియు దాని పట్ల ఎటువంటి వ్యామోహం లేకపోవడమే ఈ సత్యం. ఓ భిక్షువులారా! ఇదిగో ఇదే దుఃఖ నివారణకు దారితీసే మార్గం (దుఃఖ నిరోధ గామిని ప్రతిపద) గురించిన ఆర్యసత్యం. ఇది మరేదో కాదు, నిశ్చయంగా ఆర్య అష్టాంగ మార్గమే; అనగా సరైన వీక్షణం మొదలైనవి."

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రితాశ్రమవాసులు అయిన శ్రీమతి నుదురుపాటి లక్ష్మి గారు 3-9-2026 గురువారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 88 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారి సహస్ర నామావళిః

(గత సంచిక తరువాయి) -పాలూరి ప్రసాద్

**180. ఓం మర్మజ్ఞాయ నమః**

శ్రీగురుదేవులు మర్మము ఎఱిగినవారు. అనగా వేద వేదాంగాలు, శాస్త్రాలు, ఉపనిషత్తులు, ధర్మ సూత్రాలు మొదలైన వాటి అసలు అంతరార్థాన్ని బాగుగా ఎఱిగిన వారు. అంతే కాదు, హృదయ నివాసిగా, మన మనస్సులలో అంతర్గతంగా ఉన్న ఆలోచనలను, నిరంతరం మన అంతరంగంలో జరిగే సంఘర్షణలను బాగుగా ఎఱిగిన వారు. అందుకే వారి వద్ద మనసు దాచరాదు.

**181. ఓం సర్వ ధర్మజ్ఞాయ నమః**

శ్రీ గురుదేవులు సర్వ ధర్మాలు బాగుగా తెలిసిన వారు. ఈ లోకంలో వారికి తెలియని ధర్మమంటూ ఏదీ లేదు. అయితే వారిని ఆశ్రయించిన శిష్యులకు ఎప్పుడు ఏ ధర్మము అవసరమో వారే బోధిస్తారు. సర్వ ధర్మాలను వారికి విడిచిపెట్టి వారి ఆజ్ఞను పాటించుటయే శిష్యుల ఏకైక ధర్మము.

**182. ఓం నిర్మలానంద వార్నిధయే నమః**

సాధకుని మనస్సు అనే సముద్రాన్ని సాధన ద్వారా మథించినపుడు ఆత్మానందమనే అమృతము లభించి, ఆ ఆనందము మనస్సనే సముద్రమంతా వ్యాపించి, సంకల్పాలనే అలలు శాంతించినప్పుడు ఆ నిర్మలమైన ఆనంద సాగరమే శ్రీగురుదేవులు.

**183. ఓం ఇష్టకామ్యార్థదాయ నమః**

శ్రీ గురుదేవులు తమను ఆశ్రయించిన వారికి ఇష్టమైన కోరికలన్నిటినీ ప్రసాదించే ప్రసాద దేవులు. వారిని కోరిన ధర్మపరమైన ఏ కోరికైనా వెంటనే తీరుతుంది. వారు మనం కోరినవన్నీ ఇస్తారు. అయితే మనం ఈ ప్రపంచ విషయాలపై ఇష్టాన్ని తగ్గించుకొని శ్రీగురుదేవులపై ఇష్టాన్ని పెంచుకొన్నప్పుడు వారే మన స్వంతమౌతారు.

**184. ఓం దుష్టారిష్టదాయ నమః**

శ్రీగురుదేవులు దుష్టులకు అరిష్టాలను కలిగించువారు. అనగా తమ బలాన్ని, సంపదను చూసుకొని గర్విష్టులై దుష్టులైన వారికి కొన్ని కష్టాలను కలిగించి, వారు ఆ కష్టాలను తమంత తాము అధిగమించలేని స్థితిలో, తమ ప్రజ్ఞ ఎందుకూ పనికిరాదని, తమకు ఈ బలాన్ని, సంపదను ప్రసాదించిన శక్తి ఏదో ఒకటి ఉన్నదనే సూచన వారికి కలుగజేసి, వారిని మెల్లగా భగవదున్ముఖులను చేయుటయనే అత్యద్భుత చికిత్సా విధానమందు నిష్ణాతులు శ్రీగురుదేవులు. వారు దుష్టులను శిక్షించినట్లు పైకి అనిపించినా అది వారికి సద్వస్తు దర్శనార్థమై ఇచ్చే శిక్షణ మాత్రమే.

**185. ఓం కష్టదూరగాయ నమః**

శ్రీ గురుదేవులు మన కష్టాలను పోగొట్టగల సమర్థులు. వారు మనకు ఎట్టి సహాయము లేదా చికిత్స చేయనవసరం లేదు. కేవలం వారి ఒక్క మాటతోనే, ఒక్క చూపుతోనే, ఒక్క సంకల్ప మాత్రముననే మనకు కలిగిన కష్టాలను, ఆధి వ్యాధులను హరించగల సమర్థులు శ్రీగురుదేవులు. ఇది వారిని ఆశ్రయించిన వారందరికి అనుక్షణం అనుభవములో ఉన్న విషయమే.

**186. ఓం తుష్టి పుష్టి ప్రదాత్రే నమః**

శ్రీ గురుదేవులు తమను ఆశ్రయించిన వారికి తృప్తిని, బలాన్ని ప్రసాదిస్తారు. ఈ ప్రపంచంలో మనకు ఇష్టమైన పదార్థాలు ఎన్ని తిన్నా మనకు తృప్తి కలుగదు. అలాగే వాటి వల్ల మనకు బలం కూడా రాదు. కానీ శ్రీ గురుదేవుల ప్రసాదాన్ని స్వీకరించుట ద్వారా మనకు ఎంతో తృప్తి కలుగుతుంది. ఆ ఆనందాన్ని నిజంగా అనుభవించిన నాడు ఇక ప్రపంచములోని ఏ రుచుల మీదకు మనస్సు పోదు. అలాగే ఆ ప్రసాదం మనకు ఎంతో బలాన్ని ప్రసాదించి అంతశ్శత్రువుల మీద విజయానికి సహాయపడుతుంది.

**187. ఓం విష్టపత్రయ సంస్తుతాయ నమః**

విష్టపములనగా లోకములు. శ్రీగురుదేవులు ఈ మూడు లోకములలోని జనులచేత స్తుతింపబడేవారు. సత్వగుణ ప్రధానులైన దేవలోకవాసులు వారి యొక్క మహిమను గ్రహించి ఆ ఆనందంలో వారిని కీర్తిస్తారు. రజోగుణ ప్రధానులైన భూలోకవాసులు వారి నుంచి ఏదో ఉపకారాన్ని ఆశించి వారిని కీర్తిస్తారు. ఇక తమోగుణ ప్రధానులై పాతాళలోక వాసులైన రాక్షసులు కూడా వారి నుంచి అమోఘమైన వరాలను ఆశించి వారిని కీర్తిస్తారు. అయితే ఎవరు ఏ విధంగా వారిని సేవించినా వారు అందరిని యోగ్యతలకు తగినట్లుగా స్వీకరించి వారి వారి మార్గములలోనే వారిని తమ సన్నిధికి చేర్చుకుంటారు.

**188. ఓం సర్వేంద్రియ మదధ్వంసినే నమః**

ఎన్నో జన్మలనుండి మనను అనుసరించి వస్తున్న వాసనల కారణంగా మదించిన మన సకల ఇంద్రియాలను నియంత్రించి వాటిని సన్మార్గములో నడిపించగల సమర్థులు శ్రీగురుదేవులొక్కరే. శ్రీగురుదేవులను ఆశ్రయించి, వారియందు అచంచలమైన విశ్వాసముంచి, వారి ఆజ్ఞను తు.చ. తప్పక పాటించే అట్టి సాధకులయొక్క అంతఃకరణ చతుష్టయమైన మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారములు సత్యము, శాంతి, దయ, ప్రేమలుగా మారిపోతాయి. అంతశ్శత్రువులైన కామ క్రోధాదులు శమాది షట్కసంపత్తిగా మారిపోతాయి. అట్టి వారి జ్ఞానేంద్రియాలు ఎల్లప్పుడూ సద్విషయాలనే స్వీకరిస్తాయి. వారి కర్మేంద్రియాలు సత్కర్మలనే ఆచరిస్తాయి.

- సశేషం

# శ్యామ సుందరా! ఒక్కసారి,
# ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ!

(గత సంచిక తరువాయి)

- కీ.శే. రమణ ప్రసాద్

సుదర్శన విహీనమైన ఆ రిక్తస్థానాన్ని అర్జునుడు ఇంక చూడలేక పోయాడు. అటునుండి తన దృష్టి మళ్ళించాడు. అక్కడ ఒక సింహాసనంపైన కృష్ణునికి ప్రియాతిప్రియమైన పాంచజన్యం పడి ఉంది. దానిని కృష్ణుడు ఎల్లప్పుడూ తన చెంత ఉంచుకొనేవాడు...! ఇప్పుడు దానిని వదిలి వెళ్ళిపోయాడు.... ఇంక కృష్ణుడు ఎప్పుడూ ఎవరికీ కనిపించడు! దేహధారి అయిన కృష్ణుడు ఇప్పుడు విదేహుడైనాడు కదా!...



మూడవజాము ఢంకా మ్రోగింది. బ్రహ్మముహూర్తం వేళ అయింది. అర్జునుడు క్షణకాలం సేపు పద్మాసనస్థితుడై, బ్రహ్మస్మరణ చేశాడు. స్నానాదులుచేసి యజ్ఞవేదికలో ఆహుతి వేశాడు. అప్పుడే.... పూర్వదిశగా, అంధకారాన్ని చీల్చుకొంటూ తొలికిరణం మెరిసింది. అర్జునుడు బయటకు తొంగి చూశాడు. బయట చీకటిగా ఉంది. దారుకుడు ఇంకా వచ్చి ఉండడు. కాని...

అర్జునుని భావన అబద్ధమయింది. అప్పటికే దారుకుడు వచ్చి అర్జునునికోసం ప్రతీక్ష చేస్తున్నాడు.

'దారుకా!' అర్జునుడు ఆశ్చర్యంగా చూశాడు.

'అయ్యా! రథం తయారుగా ఉంది' దారుకుడు దగ్గరకు వచ్చి అన్నాడు. తండ్రి వసుదేవుని యోగ సమాధి విషయం ద్వారకలో వెల్లడి అయింది.

నగరవాసులంతా పితాశ్రీ ఉండే మహలుకు చేరుకొని ఉంటారు అన్నాడు.

అర్జునుడు ఏమీ అనలేదు. తన తండ్రి వసుదేవుని అంతిమ దర్శనం చేసుకోగలడు.. దారుకునితో 'త్వరగా వసుదేవుని భవనానికి

తీసికొనివెళ్ళు అన్నాడు. 'ఆయన సమాధిలోకి వెళ్ళేముందు, ఆయన కళ్ళలోని అమృతరసాన్ని ఒక్కసారి ఆస్వాదించి నా తృష్ణను తీర్చుకొంటాను.. ఆ తర్వాత..' అన్నాడు. దీర్ఘంగా నిట్టూరుస్తూ..

అర్జునుడు వసుదేవుని భవనానికి చేరుకునేసరికి, ఆత్మ బ్రహ్మలో విలీనమవటానికి వేగిరపడుతున్న వసుదేవుని పార్థివ శరీరంలోని బ్రహ్మనాడిలో సంచలనం మొదలయింది.

తాను క్రితం రాత్రి చూసిన వసుదేవునికి, ఇప్పుడు చూస్తున్న వసుదేవునికీ ఎంత తేడా! వసుదేవుడు ఈరోజు ఎంతో తేజస్సుతో వెలిగిపోతున్నాడు! అనుకున్నాడు అర్జునుడు.

కటిక నేలపైన వ్యాఘ్రచర్మం పరచుకొని పద్మాసనంలో అర్ధ నిమీలిత నేత్రాలతో కూర్చుని ఉన్నాడు వసుదేవుడు. ఆ అరమోడ్చిన కన్నులు అస్పష్టంగా కదులుతున్న పెదవులు, యోగముద్ర వాతావరణాన్ని అంతా గంభీరంగా పవిత్రంగా చేస్తున్నాయి. దేవకీమాత ఎంతో స్థిరచిత్తంతో, ఎన్నోయుగాల సంబంధాలను సారవిహీనం అని దృఢంగా నిశ్చయించుకొని, తటస్థభావంతో తన పతియొక్క ఎడమవైపున నిశ్చలంగా కూర్చొని ఉన్నది. గడచిన మూడు జాములకాలంలో వారిలో ఎంత మార్పు! అర్జునుడు తనకు తెలియకుండానే ఆ వాతావరణంతో ప్రభావితుడైనాడు.

తన అడుగుల సవ్వడి అక్కడి ప్రశాంతతకు ఎక్కడ భంగం కలిగిస్తుందో అని సవ్వడి చేయకుండా అర్జునుడు నెమ్మదిగా వచ్చి వసుదేవుని సముఖంలో కూర్చున్నాడు. కాని అంతర్ముఖుడైన వసుదేవుడు ధ్యానలోకంలో ఎంతో దూరం వెళ్ళిపోయాడు. ఆయన ఇప్పుడు దేనినీ కనులు తెరిచి చూచే స్థితిలో లేడు. పెదవుల కదలిక క్రమంగా తగ్గిపోయింది.

కొద్దిసమయం గడిచే లోపలే, రుక్మిణి, సత్యభామ, బాలకుడు వజ్రుడు, ద్వారకా నగరవాసులు ఆ భవనం ముందు చేరారు. మనిషి అస్తిత్వానికి గుర్తు అయిన ఉచ్ఛ్వాస, నిశ్వాసాలను తప్పించి అక్కడ ఏ సవ్వడీ లేదు. గంభీరమైన నిశ్శబ్దం ఒక్కటే అంతటా అలముకొని వుంది. అందరి కళ్ళు వసుదేవుని పైననే నిల్చిఉన్నాయి.

- సశేషం

# నారద భక్తి సూత్రములు

(గత సంచిక తరువాయి) - వారణాసి కాళీ ప్రసాద్ **U.S.A**

భక్తి సూత్రం 66- **త్రిరూపభంగపూర్వకం నిత్యదాస్య నిత్యకాంతా భజనాత్మకం ప్రేమ కార్యం ప్రేమైవ కార్యమ్**



**తాత్పర్యం:** గౌణ భక్తిని అధిగమించి, భగవంతుని నిత్యసేవకుడిగా ఉండే దాస్య భావనతోనైనా, భగవంతుడే తనకు అత్యంత ప్రియమైనవాడనే నిత్యకాంతా భావంతోనైనా, శుద్ధమైన ప్రేమభక్తిని పెంపొందించుకోవాలి; చివరికి సాధించవలసినది కేవలం భగవానునిపై ప్రేమ మాత్రమే.

ఈ సూత్రం ద్వారా నారదులు భక్తి యొక్క పరిపక్వ స్థితిని నిర్దేశిస్తున్నాడు. మనో భావాలను భగవంతుని వైపు మళ్ళించడం మధ్యస్థ సాధన అయితే, ఆ భావాల వెనుక ఉన్న గుణాతీత స్థాయిని చేరుకొని చివరకు భగవంతుని పట్ల ప్రేమ మాత్రమే మిగలాలని ఈ సూత్రం వివరిస్తోంది.

**త్రిరూపభంగపూర్వకం** - ప్రకృతి నుంచి ఉద్భవించిన సత్త్వం, రజస్సు, తమస్సు అయిన త్రిగుణాలు సాధారణ జీవితాన్ని మాత్రమే కాదు, ప్రారంభదశలో ఉన్న భక్తిని కూడా ప్రభావితం చేయగలవు. సాత్త్విక భక్తిలో శాంతి, పవిత్రత, జ్ఞానం ప్రధానంగా ఉంటాయి; రాజసిక భక్తిలో ఫలాపేక్ష, కోరిక, సాధించాలనే ఆరాటం కలిసివుంటాయి; తామసిక భక్తిలో అజ్ఞానం, భయం, ద్వేషం లేదా అవివేకం యొక్క ప్రభావం ఉండవచ్చు. ఇవన్నీ భక్తి యొక్క ప్రారంభ లేదా గౌణ రూపాలుగా ఉండవచ్చు. అయితే పరాభక్తి ఏ గుణానికీ బంధించబడదు. అందుకే **“త్రిరూపభంగపూర్వకం”** అనే పదం, ఈ మూడు గుణాల ప్రభావాన్ని అధిగమించడం అవసరమని తెలియజేస్తోంది.

ఇక్కడ సత్త్వగుణం కూడా ఎందుకు దాటవలసి వస్తుందనే ప్రశ్న సహజంగా ఉద్భవిస్తుంది. సత్త్వం రజస్సు, తమస్సుతో పోలిస్తే శుద్ధమైనదే అయినప్పటికీ, అది కూడా ప్రకృతిగుణమే. పరాభక్తిలో భక్తుని దృష్టి తన సాత్త్వికతపైన కాక భగవంతునిపై మాత్రమే ఉంటుంది.

**నిత్యదాస్యం** - సేవే స్వరూపంగా మారడం నిత్యదాస్యం అంటే అప్పుడప్పుడు

భగవంతునికి సేవ చేయడం మాత్రమే కాదు. తన జీవితం మొత్తం భగవత్సేవగా భావించే స్థితి. దాస్యభావంలో అహంకారం తగ్గుతుంది, కర్తృత్వభావం కరుగుతుంది, తనకు లభించిన శరీరం, బుద్ధి, సంపద, ప్రతిభ అన్నీ కేవలం సేవాసాధనాలుగా మారుతాయి.

యజమానికి భయపడే సేవకుడి భావంతో కాక, ప్రియమైన స్వామికి సేవ చేయడమే తన ఆనందంగా భావించే స్థితియే నిజమైన దాస్యభావం. ఆ స్థితిలో వున్న భక్తుని సేవ కర్తవ్యం వలే కాక సహజ స్వభావంగా మారుతుంది.

**నిత్యకాంతాభావం** - అనన్య ప్రేమ యొక్క పరాకాష్ఠ. కాంతాభావం అంటే భగవంతుడే తన హృదయానికి అత్యంత ప్రియమైనవాడనే అనుభూతి. ప్రియునిపై ఉండే ఏకనిష్ఠమైన ప్రేమలో ఇతర అన్ని విషయాలు రెండవ స్థానంలో నిలిచినట్లే, భక్తునికి భగవంతుడు ఒక్కడే పరమప్రియుడు అవుతాడు. నిత్యకాంతాభావం శరీర సంబంధం కాదు; అనన్యత మరియు సంపూర్ణ సమర్పణతో కూడిన భక్తిభావం.

భగవద్గీతలో గీతాచార్యుడే స్వయంగా

**మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు**
**మామేవైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మే ॥**

అంటూ మనస్సును తనపై నిలిపి, భక్తిగా, ఆరాధనతో, నమస్కారభావంతో జీవించే స్థితి తనతో అత్యంత ప్రియమైన సంబంధానికి దారితీస్తుందని సెలవిచ్చారు.

దాస్యభావం భక్తునిలో వినయాన్ని పెంచితే, కాంతాభావం భగవంతునితో సాన్నిహిత్యాన్ని పెంచుతుంది. దాస్యంలో భగవంతుని మహిమకు గౌరవం ప్రధానమైతే, కాంతాభావంలో ఆయన పట్ల పరమానురాగం ప్రధానమవుతుంది. ఈ రెండూ కలిసినప్పుడు గౌరవంతో కూడిన ప్రేమ, ప్రేమతో కూడిన సేవ ఏర్పడతాయి.

**"ప్రేమ కార్యం ప్రేమైవ కార్యమ్"** - సూత్రం చివర్లో నారదుడు ప్రేమ కార్యం అని చెప్పి, వెంటనే ప్రేమైవ కార్యమ్ అని పునరుక్తి చేస్తాడు. ఈ పునరుక్తి అత్యంత ముఖ్యమైనది. భక్తి మార్గంలో శ్రవణం, కీర్తనం, జపం, పూజ, వందనం, సేవ, ధ్యానం, సత్సంగం, మొదలైన సాధనలు అనేకం వుండవచ్చు. కానీ వీటన్నింటి అంతిమ ప్రయోజనం మాత్రం భగవంతునిపై

ప్రేమయే. అందుకే నారదులు ప్రేమను రెండుసార్లు నొక్కి చెబుతున్నారు. భక్తికి సాధనం ప్రేమ వైపు తీసుకెళ్ళాలి; భక్తికి ఫలం కూడా ప్రేమే కావాలని ఈ సూత్రం తెలియజేస్తుంది.

దాస్యంలో భక్తుడు తన జీవితాన్ని సేవగా సమర్పిస్తాడు. కాంతాభావంలో తన హృదయాన్ని సంపూర్ణంగా సమర్పిస్తాడు. ఈ రెండింటిలోనూ కేంద్రం భగవంతుడే. భక్తిలో చివరకు సాధించవలసినది భగవంతుని పట్ల ప్రేమ అని దానిని స్థిరపరచుకోవడమే పరాభక్తి అని నారదులు ఈ సూత్రం ద్వారా సెలవిస్తున్నారు.

- సశేషం

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును**

**అక్టోబర్ 2026**

5 సోమ: శ్రీ గురుదశమి – శ్రీ సద్గురు పాదపూజ

11 ఆది: శ్రీ దేవీ శరన్నవరాత్రి ప్రారంభం

20 మంగళ: విజయదశమి – శ్రీ సద్గురు పాదపూజ

26 సోమ: ఆశ్వయుజ పూర్ణిమ – శ్రీ సద్గురు పాదపూజ

**నవంబర్ 2026**

4 బుధ: శ్రీ గురుదశమి – శ్రీ సద్గురు పాదపూజ

7 శని: నరకచతుర్దశి – శ్రీ సద్గురు పాదపూజ

8 ఆది: దీపావళి పండుగ – శ్రీ సద్గురు పాదపూజ

24 మంగళ: కార్తీక పూర్ణిమ – గురుపూర్ణిమ. శ్రీ సద్గురు పాదపూజ

27 శుక్ర: కార్తీక బహుళ తదియ – శ్రీ సద్గురుదేవుల 38వ వార్షిక పుణ్యారాధన ప్రారంభం.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు , ఆశ్రమ నివాసులు అయిన రావి హర్షవర్ధన్ కాళీప్రసాద్ గారు 16-9-26 బుధవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 22 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

అక్టోబర్ 2026

5 సోమ: శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

8 గురు: మాసశివరాత్రి

10 శని: అమావాస్య

11 ఆది: శ్రీ దేవీ శరన్నవరాత్రి ప్రారంభం – ఉ. 9.09 గం.లకు అంకురార్పణ

17 శని: మూలా నక్షత్రం – సరస్వతీ పూజ

18 ఆది: దుర్గాష్టమి – సామూహిక కుంకుమ పూజలు

19 సోమ: మహర్నవమి

20 మంగళ: విజయదశమి – సామూహిక కుంకుమ పూజలు

21 బుధ: ఏకాదశి – ఏకాహం, దీక్షావిరమణ, శ్రీ సద్గురు పాదపూజ

26 సోమ: ఆశ్వయుజ పూర్ణిమ – శ్రీ సద్గురు మండల దీక్ష ప్రారంభం. శ్రీ మాతాజీవారి జన్మదిన మహోత్సవం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

నవంబర్ 2026

4 బుధ: శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

7 శని: నరకచతుర్దశి, శనిత్రయోదశి, మాసశివరాత్రి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన

8 ఆది: దీపావళి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన

9 సోమ: అమావాస్య – ఆకాశదీపం.

12 గురు: 12 నుండి 20 వరకు శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి పంచామృతములు, నవరసములతో ఏకాదశ రుద్రాభిషేకములు, లక్ష బిల్వార్చన.

13 శుక్ర: నాగుల చవితి

20 శుక్ర: చిలుక ఏకాదశి – ఏకాహం, శ్రీ సద్గురు పాదపూజ, సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రతములు, భక్త సమారాధన.

21 శని: క్షీరాబ్ధి ద్వాదశి – శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

24 మంగళ: కార్తీక పూర్ణిమ – గురుపూర్ణిమ. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన. శ్రీ రామలింగేశ్వర స్వామి నగరోత్సవం. జ్వాలాతోరణం

27 శుక్ర: కార్తీక బహుళ తదియ – శ్రీ సద్గురుదేవుల 38వ వార్షిక పుణ్యారాధన ప్రారంభం. ఉ. 10:17 గం.లకు పూజ్య శ్రీ మాతాజీ వారిచే దీక్షా స్వీకరణము. రాత్రి 7.00 గం.లకు శ్రీ సద్గురుదేవుల పుణ్యారాధన.

# మాయా విలాసం

(గత సంచిక తరువాయి) -వేలమూరి రవికుమార్

మూడవ ప్రశ్న- మరి జరిగినదంతా అసత్యమైతే మరి సత్యమేమిటి? – దీని గురించి విచారణ చేద్దాం. దీనినే గురుదేవులు సత్యాసత్య విచారణ జ్ఞానం అని బోధించారు. ఒకసారి బ్రహ్మ పుత్రులైన సనకసనందనాదులకు ఈ సృష్టిగురించి పైన చెప్పిన అనుమానమే కలిగింది. కనబడే జగత్తు అంతా అసత్యమైతే మరి సత్యమేమిటి అని. దాని నివృత్తి కొరకు వారు తండ్రిగారైన బ్రహ్మ వద్దకు వెళ్ళారు.

బ్రహ్మగారు సరస్వతీ మాత వీణను ఎంతో మధురంగా వాయిస్తుండగా, పరవశులై ఆనందంలో మునిగి వుండటం చూసి, ఈయన బాహ్య సుఖాలనే అనుభవిస్తూ ఇంకా సంసార సుఖాలపట్ల ఇచ్ఛ వదలుకోలేదు కనుక మన సందేహ నివృత్తి చేయలేడని తలచి, అక్కడి నుండి వైకుంఠానికి వెళ్ళారు. అక్కడ శ్రీ మహావిష్ణువు లక్ష్మీదేవి పాదాలు వత్తుతుండగా ఆవిడతో సరస సంభాషణ చేస్తూ కనబడ్డాడు. శ్రీహరి కూడా సంసార సుఖాలకు లోనై వున్నాడని భావించి, అక్కడి నుండి కైలాసానికి బయలుదేరారు. ఇక్కడ ఒక్క విషయాన్ని గమనించాలి. సదరు బ్రహ్మగాని, విష్ణువు గాని వారికి జ్ఞానాన్ని అందజేయలేరా? అంటే అది అసలు ప్రశ్నే కాదు. వారు అనుకున్న మరుక్షణమే వీరికి జ్ఞానాన్ని అందజేయగల సత్తా వున్నవారు. కానీ, వారు వీరంతట వీరు జ్ఞానాన్ని సముపార్జించాలని, ఈ విషయంలో ఎవరికి వారే కష్టపడాలి గాని వేరే వారి వల్ల పొందేది కాదని తెలియజేయదలచుకున్నారు.

ఇంతలో కైలాసం నుండి పరమేశ్వరుడు ఇదంతా గమనిస్తున్నాడు. ఆయన ఆదియోగి. ఆయనకి వీరిపై అపారమైన ప్రేమ కలిగింది. వారికి జ్ఞానబోధ చేయాలని సంకల్పించారు. ఆ పరమేశ్వరుడు వెనువెంటనే దక్షిణామూర్తిగా ఒక మఱ్ఱిచెట్టు క్రింద మౌనధ్యాన ముద్రలో (చిన్ముద్రలో) అవతరించారు. సనకసనందనాదులు పరమేశ్వరుని వెతుకుతూ ఆ వృక్షం క్రిందకు చేరారు. అక్కడ పరమేశ్వరుడు ఏమీ మాట్లాడకుండానే చిన్ముద్రతో వారికి జ్ఞాన ప్రబోధం చేశారు. మూడు గుణాలను రహితం చేసుకుని, జీవాత్మను పరమాత్మతో ఐక్యం చేయమని సూచించారు. వారు ఆ విధంగా చిన్ముద్ర ధరించి, ధ్యాన యోగం ద్వారా బ్రహ్మజ్ఞానాన్ని పొందారు. విచిత్రమేమిటంటే ఇక్కడ మాటలు లేవు. కాని పరమ గురువుల అనుగ్రహం, కరుణ, దయ వారిపై వర్షించి, వారు ఆత్మజ్ఞాన సంపన్నులయ్యారు.

ఈ జగత్తు మనము అజ్ఞానమనే నిద్రలో వున్నంత వరకూ సత్యము. మెలకువ అంటే జ్ఞానోదయమైన పిదప అసత్యము. ఇది నిరంతరమూ తమ బోధలతో తెలియజేసేవారే శ్రీ సద్గురుదేవులు. ఒక రోజు నాకు మంచి నిద్ర వచ్చింది. ఆ నిద్రలో ఒక కల వచ్చింది. ఆ కలలో నేను ఒక పరాక్రమవంతుడైన రాజును. నా చుట్టూ ఎంతో మంది పరిజనులు నాకు సేవ చేస్తున్నారు. నేను ఏది కావాలంటే అది అందజేయబడుతోంది. ఎంతో ఠీవిగా అంతఃపురంలో అందమైన రాణులతో విహరిస్తున్నాను. నేను అత్యంత పరాక్రమవంతుడను అవడం వలన, ఎంతో యుద్ధం తెలిసి వుండటం వలన, నేను చేసిన ప్రతి యుద్ధం గెలుస్తూ వున్నాను. ఇలాగే ఒకసారి ఒక యుద్ధానికి వెళ్ళి సాయంత్రం అలసిపోయి ఒక గుడారం

వేసుకుని నిద్రకు ఉపక్రమించాను. రాజుగా వున్న నాకు ఒక భయంకరమైన కల వచ్చింది. ఆ కలలో నేను నా రాజ్యాన్ని పోగొట్టుకుని, దరిద్రాన్ని అనుభవిస్తూ ఒక పూరిగుడిసెలో వున్న భావన కలిగింది. ఎంతో వేదనకు గురికాసాగాను. ఇంతలో నాకు మెళకువ వచ్చింది. దానితో నా కలలోని రాజుగారి వేదన అంతమయింది. ఇప్పుడు ఆలోచన మొదలయింది. నేను రాజునవ్వడం సత్యమా! లేక రాజ్యం పోగొట్టుకుని కడు పేదవాడిని అవ్వడం సత్యమా! అని. ఇక్కడ ఒక చిక్కు వున్నది. కలలో నేను రాజును. కనుక నేను రాజు అన్న విషయమే ఆ రాజుకు సత్యం అనిపిస్తుంది. మరి నిజంగా చూస్తే అది (రచయిత) కలలో తను సృష్టించుకున్న మాయా పాత్ర. కనుక నిజమవ్వడానికి వీలులేదు. ఎందుకంటే, రచయితకు మెలకువ వస్తే మాయాపాత్ర రాజుగారు అంతమవుతున్నాడు కనుక. అయితే రచయిత రాజుగా మారి ఎన్ని యుద్ధాలు చేశాడు. అవన్నీ నిజమేనా? అంతకు పూర్వం అతడు ఒక రచయితే కానీ, ఎటువంటి యుద్ధమూ చేయలేదే! అంటే అతని మనస్సే రచయితకు రకరకాల భావనలు కలిగించింది. ఆ భావనలకు చిత్తం రూపం కల్పిస్తూ ఒక నాటిక సిద్ధం చేసింది. ఆ నాటికలో తాను రాజునని అతని అహంకారము అతనిని బాధించింది. నిజానికి అతను రచయిత తప్ప ఏమీ కాడు. అయినా అన్ని భావనలు, అనుభూతులు పొందాడు. అజ్ఞానంతో అయోమయానికి గురి అయ్యాడు. మరి ఈ అజ్ఞానాన్ని పోగొట్టుకోవడం ఎలా? దీనికి భ.గీ 10/11శ్లో. **తేషామేవానుకంపార్థమ్ అహమజ్ఞానజం తమః। నాశయామ్యాత్మ భావస్థో జ్ఞాన దీపేన భాస్వతా ॥** –ఓ అర్జునా! నా అంతఃకరణమున స్థితుడనై వున్న నేను వారిని అనుగ్రహించడానికి ఒక తేజోమయమైన తత్వజ్ఞాన రూప దీపము వెలిగించి వారి అజ్ఞానాంధకారమును పారద్రోలతాను. అని శ్రీకృష్ణ భగవానుడు చెప్పి యున్నాడు. అనగా అజ్ఞానముచే కలిగిన సంసారమనెడి చీకటిని పారత్రోలుటకు తానే గురువుగా అవతరించి జ్ఞానోదయం కలుగజేసి, సంసారబంధ విముక్తుడిని చేస్తాను.

**శ్రీ గురుగీతలో - జ్ఞానం వినా ముక్తిపదం లభ్యతే గురుభక్తితః। గురుస్సమానతో నాన్యత్సాధనం గురుమార్గిణామ్॥** అని పరమశివుడు ఉటంకించాడు. అలాగ ఇది సత్యము. ఇది అసత్యము అని తెలియజేసే శాస్త్రాలు చాలా వున్నాయి. కాని అవి ముక్తిని, మోక్షాన్ని అందించలేవు. కాని, గురుబోధ, గురుపాదసేవ, గురుభక్తి మాత్రం ఖచ్చితంగా ముక్తిని మోక్షాన్ని ప్రసాదిస్తాయి. నిజమైన గురుభక్తులకు శాస్త్రజ్ఞాన అవసరమే లేదు. ఎందుచేతనంటే, గురువే సర్వశాస్త్ర స్వరూపుడు కనుక ఆయనే పరబ్రహ్మము కనుక. శ్రీగురుగీతలో మరొక శ్లోకం.. **గురోః కృపా ప్రసాదేన బ్రహ్మ విష్ణు మహేశ్వరాః। సామర్థ్య మభజ సర్వే సృష్టి స్థిత్యంత కర్మణి॥** అనగా శ్రీ గురుదేవుల అనుగ్రహము వలననే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు సృష్టి, స్థితి, లయలనే కార్యములను నిర్వహించే సామర్థ్యాన్ని పొందారు. కాబట్టి అట్టి సద్గురు దేవులయిన శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్‌వారిని, శ్రీశ్రీశ్రీ మాతాజీవారిని సేవించి, వారు చెప్పినది ఆచరించి, వారి అనుగ్రహానికి పాత్రులమై, ముక్తిని, మోక్షమును పొందెదము గాక! సర్వాధిష్ఠాన చైతన్య సమర్థ సద్గురు శ్రీశ్రీశ్రీ హనుమత్ కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ కీ జై!

## పిలుపు సేకరణ - కీ.శే. ఎమ్. జె. శాస్త్రి

మన గమ్యము యీ జీవితంలోనే పరిపూర్ణత్వాన్ని పొందుట లేక ఆత్మ సాక్షాత్కారం, లేక భగవత్సాక్షాత్కారం పొందుట. ఎవరికైతే "అంతరంగపు పిలుపు" వినిపిస్తుందో వారు ప్రయత్నిస్తారు. మనం ప్రస్తుతం ఉన్నది నిజస్థానం కాదు. అది మన లోపల ఉన్నది. మన లోపలే ఉన్న దానిని వదలుకొని ప్రాపంచపు భోగభాగ్యాలవైపు, సుఖాల వైపు పరుగిడినట్లయితే, మన జీవితమే వృధా అవుతుంది. ఈ మాయా ప్రపంచపు ఆటలతో, అలసి, సొలసి, ప్రాపంచపు సుఖలాలసతో విసుగెత్తినపుడు మాత్రమే మన నిజ స్థానానికి మరల చేరాలని అనిపించి మనదృష్టి "లోదృష్టిగా" మారుతుంది.

మనకు బాహ్యంగా వున్న వస్తువులు, విషయాల నుండి నిస్సందేహంగా కొంత సంతోషాన్ని, సుఖాన్ని పొందవచ్చు. కానీ, మనకు కావలసినది తాత్కాలిక సుఖం కాదు గదా! జీవితపు వున్నత విలువలను గురించి ఏ విధమైన చింతనా లేక లౌకిక సుఖాలతో సంతృప్తి చెందుతూ, మరొక ఉన్నత ప్రపంచం వున్నదని గాని, ఆత్మ వున్నదని గాని, పరమాత్మ వున్నదని గాని, అతీతమైన శక్తి ఉన్నదని గానీ, విశ్వాసం లేని జనులు యీ ప్రపంచంలో లక్షలాదిగా ఉన్నారు. బహ్య విషయములపై ఆధారపడు వారికి ఏ విధమైన ఆలోచన వుండదు. ఈ జీవితంలోనే పరమ గమ్యాన్ని సాధిద్దామని నిజాయితీగా ప్రయత్నించే సాధకులు సాధారణ పురుషులు, స్త్రీలు కారు. ఈ రెండు రకములు పరస్పర విరుద్ధ భావముల మధ్య నలిగి పోతుంటాము.

నిజమైన ఆధ్యాత్మిక జీవితం కొందరికే సాధ్యము అన్న విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి. నిజానికి ఈ ప్రపంచంలో అతి కొద్ది మంది మాత్రమే ఆధ్యాత్మిక జీవనపు వజ్రాలు కావాలనుకుంటారని మనం జ్ఞప్తి ఉంచుకోవాలి.ఇంద్రియ సుఖముల వైపుకే పరుగిడు వారు చివరకు పతనం అవుతారు. అంతరంగపు పిలుపు వినబడిన కొద్ది మంది ఆ పిలుపునకు తగిన విధంగా ప్రవర్తించుటకు సిద్ధపడతారు. శ్రీ శంకరాచార్యుల వారు వివేక చూడామణిలో మూడు వస్తువులు జీవితములో లభించుట అరుదని సెలవిచ్చారు.

మానవ జన్మ లభించుట, మోక్షము పొందవలెననెడి ఆకాంక్ష , మహా పురుషుల ఆశ్రయము – ఈ మూడును దొరకుట దుర్లభము. దైవానుగ్రహము వలన మాత్రమే కలుగును.ఈ మూడును అరుదు. కష్టసాధ్యము, ఐనా వీటికి తోడు, అతి ముఖ్యమైన అంశము – మన లక్ష్యము యెడల మనకుగల తీవ్ర పరితాపము, మనకు అరుదైన మానవ జన్మ లభించింది, గురువు అనుగ్రహం కూడా లభించింది. సరియైన మార్గం కూడా దొరికింది. సత్సంగం కూడా లభించింది అనుకుందాం. ఇవన్నీ వున్నా, వీటి అన్నిటి నుంచి పొందవలసిన లబ్ధిని పొందుటకు కావలసిన ఆతృత, పరితాపము, మనలో లోపించ వచ్చును. పరమ గమ్యము దిశకు చేయు యాత్రలో ఎటువంటి కష్టములు ఎదురైనా ఎదుర్కొనుటకు సిద్ధముగా ఉండాలి.

ఆరంభ దశలో కొంత అభిరుచి, ఉత్సాహం ఉంటుంది. ఆధ్యాత్మిక ఆనందం పొందుతున్నాం అనుటకు ఏ విధమైన, దృఢమైన, నిర్ధారణ, కలుగక పోవటంతో, మనకు ఉత్సాహం తగ్గుతున్నది. దానిని స్థిరపరచటం చాలా కష్టమవుతుంది.

ప్రసిద్ధి చెందిన తన గేయం "అమృతత్వపు పలుకులలో విలియమ్ వర్డ్స్‌వర్త్ "మన జన్మ- ఒక నిద్ర, మరపు మాత్రమే" అని అంటారు. కాని బ్రహ్మజ్ఞానికి, ఆత్మసాక్షాత్కారం పొందినవారికీ, నిజమైన సాధువులకు, యీ చర్మ చక్షువులకు గోచరించేదంతా అసత్యంగానే అగుపడును. కానీ చాలా మంది యీ అంతరంగిక ప్రపంచం గూర్చి తెలుసుకొనుటకు ప్రయత్నించరు.

ఆ ప్రాపంచికపు సుఖాల యెడల, అమితానందం పొందుతున్నట్లయితే, పరమగమ్యం చేరే అవకాశముండదు. ముండుకోపనిషతత్తులో జీవాత్మ పరమాత్మలను శరీరం అనే వృక్షం పైన, కూర్చొని వున్న, ఒకేరకంగా వున్న, రెండు పక్షులు క్రింద పోలుస్తారు. స్వామి వివేకానంద "మరణం తథ్యం – కాబట్టి ఒత పవిత్రమైన విజయంతో ఈ శరీరం రాలిపోనీ!" అన్నారు. "నిద్ర" అంటే మన దివ్యాత్మ యెక్క స్పృహ లేకుండా మనకు చేసేది అని. "మరపు" అంటే మన నిజ, దివ్యతత్వాన్ని మరిపింప చేసేది అని అర్థం. "ఆవరణ" అంటే నిజతత్వాన్ని మరుగు పరచుట – నిజతత్వంపై ఒక తెరవలె ఆవరించి, దాచియుంచుట. ("విక్షేపమ" అని అంటే నిజంగా ఉన్న దానిని వేరొక విధంగా వక్రీకరించి మన మనస్సు తెలుపుట.) "అహం బ్రహ్మోస్మి" మనము బుద్ధులమువలె, పరిమితమైన జీవులవలె, ప్రవర్తిస్తాము. కాని నిజానికి మనము "బ్రహ్మ స్వరూపులమే" – "జీవో బ్రహ్మైవ నా పరః".

మనం ఎటువంటి అసత్యమైన బంధాలకు అంటిపెట్టుకొనకుండా వుండాలి. "మనం నిజాయితిగా వుండాలి. మన ఆలోచనలకు, భావాలకు ద్రోహులుగా, మనం వుండరాదు." "మన భావాలకు అణుగుణంగా మనం తయారవుతాము".

వాల్మీకి తన తల్లి, భార్యను పోషించుటకు బందిపోటు దొంగగా మారాడు. నారదుడు "నువ్వు పొందే పాపంలో భాగం పంచుకొనుటకు నీ భార్య, తల్లి, తండ్రి, సిద్ధంగా వున్నారేమో కనుక్కోనిరా" అన్నాడు. నారదుని చెట్టుకు కట్టి యింటికి వెళ్ళి సభ్యులందరితో హత్యలు, దోపిడీలతో, మిమ్ములను పోషిస్తున్నాను. యీ పనులచే వచ్చే పాపాలలో భాగం పంచుకుంటారా? అని ప్రశ్నించాడు. నీ పాపాలలో భాగం పంచుకునే అవసరం మాకు లేదన్నారు. బందిపోటు తిరిగి వచ్చి నారదుని కట్లు విప్పి, దీనంగా "నా కళ్ళు తెరిపించారు. మీ పాదాలే నాకు శరణ్యం" అన్నాడు. ఆ విధంగా నారదుని నుంచి సరియైన మార్గాన్ని వాల్మీకి నేర్చుకున్నాడు. తీవ్ర తపస్సుతో శరీరం మీద పుట్టలు (వల్మీకం) కట్టాయి. నూతన జీవితము ఆరంభమైనది. అతడు మహర్షిగా మారాడు.

మరొక ఉదాహరణః- గౌతమ బుద్దుడు, సిద్ధార్థుడు, ఒక యువరాజు. యశోధర అనే భార్య, రాహుల్ అనే కుమారుడు ఉండేవారు. తన భవంతిలో నృత్యం చూస్తుండగా,

అతనిని గొప్ప నిరాశ, ఆవేదన, శూన్యత ఆవరించింది. బయటకు వచ్చి ధ్యానమగ్ను డయ్యాడు. “కొద్ది సమయం ముందు, నృత్యం చూస్తూ ఆనందిస్తున్నాను. అది తాత్కాలిక ఆనందం మాత్రమే, శాశ్వతానందం లభించదనిపిస్తుంది”. మనస్సు తీవ్ర వైరాగ్యమునకు లోనై, తాను గడుపుతున్న జీవితం యెడల అసంతృప్తి చెందాడు.

“విశ్రాంతి కావాలనుకునే మనకు ఎన్నడూ అది దొరకదు. చిరునవ్వులు, కన్నీటి ధారల మధ్య జీవితాన్ని గడుపుతాం. ఈ శూన్య మార్గం ఎచటికి చేరుస్తుందో తెలియదు. కలనుంచి మేలుకొని నిద్రలోకి జారుకోకూడదు”. భవంతిలోనికి వెళ్ళి తన భార్య, బిడ్డలను కడసారిగా చూశాడు. ప్రసిద్ధి చెందిన తన యాత్రను ప్రారంభించాడు. అఖండ, అనంత, జ్యోతి దర్శనం పొందటంలో యాత్ర పరిసమాప్తమైంది. అతను గౌతమబుద్ధుడు! – మహా నిర్వాణము పొందిన మహానుభావుడు అని పిలువబడ్డాడు.

ఆ చివరి క్షణమైన మరణాన్ని మనం గుర్తుంచుకోవాలి. పై లోకం నుంచి ఎపుడు పిలుపు వస్తుందో మనకు తెలియదు. “నగ్నంగా, ఒంటరిగా, వచ్చిన మనం మరల నగ్నంగా, ఒంటరిగా, ప్రపంచాన్ని వదలి వెళ్ళెదము”, అతి కఠోరసత్యం, మనం వైరాగ్యాన్ని అలవరచు కోవాలి. ప్రతిదీ అశాశ్వతమైనదని జ్ఞాపకం వుంచుకోవాలి. “భగవంతుడొకడే సత్యం, శాశ్వతం. మిగిలినది అసత్యము, అశాశ్వతము” అని గుర్తెరగాలి.

ఆ శరీరము, మనస్సు, ఇంద్రియములు, మనం కాదని, ఆత్మ స్వరూపమని, దివ్యత్వాన్ని, గ్రహించిన పిదప నిశ్చయం కలుగుతుంది. మృత్యువు పిలుపు వచ్చే లోపల చిరునవ్వుతో వుండగలగాలి. “ఓ ప్రభూ! రేపు! రేపు అని కాలం గడిపేసే, నాయందు దయ అనుగ్రహం చూపించు!” భగవంతుడు మనలోనే ఉన్నాడు. తప్పులను అంగీకరిస్తే, క్షమించినా, సత్య దర్శనం చేయగలుగుతాము. భావాలకు, ఆలోచనలకు, ద్రోహం చేయరాదు. మనకు కావాల్సింది నిజాయతీ, దృఢమైన దీక్ష మాత్రమే. పూర్తి మనస్సును భగవంతునికే అర్పించాలి. సర్వసమర్పణ చేయుటకు సిద్ధంగా ఉండాలి.

ఈ విధమైన దృక్పథం, అలవరచుకుంటేనే యితరులతో మనకు గల సంబంధ బాంధవ్యములను ఆధ్యాత్మీకరణ చేయుట సాధ్యపడుతుంది. మన మనస్సును పూర్తిగా భగవంతునికి అర్పించవలెను. లౌకిక కృత్యములకు, ఆధ్యాత్మిక కార్యక్రమములకు అభేదమన్న స్ఫురణలో పనిచేయగనిగిన నాడే అది సాధ్యమవుతుంది. “ప్రాపంచిక జీవితములోనున్న వారికిది సాధ్యమగునా?” అని మనము అనుకోవచ్చును. అవును. తప్పక సాధ్యమవుతుంది. మన దైనందిన సంబంధ బాంధవ్యములను పైన చెప్పిన విధముగా ఆధ్యాత్మీకరణ గావించుకొనవలెను. ఆధ్యాత్మిక సాధకుని జీవితం అఖండ నిరామయ, అవిశ్రాంత ధ్యానమయమని ఎల్లప్పుడూ స్ఫురణ కలిగియుండవలెను. దానిలో ఏ విధమైన అంతరాయమూ ఉండకూడదు.

–స్వామి వివేకానంద

(గత సంచిక తరువాయి)

## నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్
తెలుగు అనువాదం - శశికళా దివాకర్

ఇదిలా జరుగుచుండ, ఇంద్రజిత్తు దుర్దేవతల సహాయం కోరి, పెద్ద ఎత్తున ఒక యాగమునుజేయ నిశ్చయించాడు. ఇది గ్రహించిన విభీషణుడు, "ఇంద్రజిత్తు చేస్తున్న ఈ యాగమును నియంత్రించనిచో ఈతని బలము రెట్టింపగును, ఆతనిని జయింప సాధ్యం కాదు" అని తెలియజేయగ, లక్ష్మణుడు, హనుమంతుడు మరియు అన్య వానర వీరులంతా వెడలి ఆ యాగమును ఛిన్నాభిన్నము గావించారు. పిదప అచ్చోట జరిగిన యుద్ధమందు లక్ష్మణుడు ఇంద్రజిత్తు శిరస్సును ఖండించాడు. రామునితో సహా అన్యులందరూ లక్ష్మణుణ్ణి కొనియాడారు.

ఒంటరిగా మిగిలిపోయిన రావణుడు రామునితో నేరుగ పోరిడ సిద్ధపడ్డాడు. భీకరమైన ఆ యుద్ధమందు ఒక్క క్షణం రావణుడు నిస్సత్తువతో, "ఎవరీ రాముడు? ఎక్కడనుంచి ఇంత పరాక్రమమును పొందాడు?" అని తలచి, "ఒకవేళ ఈతడు లయకారకుడైన శివుడా!? లేక బ్రహ్మయా!? లేకపోతే విష్ణుమూర్తియా!? వేదములందు చెప్పబడు పరబ్రహ్మమీతడా!?" అని స్వగతంలో తలచాడు.

పాదరక్షలులేక, రథములేకుండా నేలపై నిలబడియున్న రామునికి సహకరించ నిశ్చయించి ఇంద్రుడు తన రథమును, మాతలి అనబడు రథసారథిని పంపించాడు. ఆ భీకర యుద్ధమందు రాముడు ఎన్ని అంబులు వేసిననూ తెగిపోయిన రావణుని తలలు మరల మరల అతుక్కుని పోసాగాయి. ఆశ్చర్యమునకు లోనైన రాముని చెవిలో, మాతలి "తండ్రీ! ఇకపై ఆలసించవలదు. బ్రహ్మాస్త్రమునుపయోగించి రాముని ఛాతిని ఢీ కొనుము" అన్నాడు.

రామునిచే ప్రయోగించబడిన బ్రహ్మాస్త్రము తన పనిని తాను ఒనరించి, రావణుని వక్షస్థలములోనికి చొచ్చుకుని వెళ్ళి, ఆతనిని సంహరించింది.

తాను, తన అన్న అయిన రావణుడు ఒకే రక్తమును పంచుకుని జన్మించిన వారైననూ దుష్టుడైన తన అన్నగారికి, దహన సంస్కారములు జేయ విభీషణుడు సంకోచించాడు. "గొప్పగా పోరిడిన మీ అన్న

స్వర్గలోకమునకు చేరుకున్నాడు. ఆతనికి అంత్యసంస్కారం గావించి, ఆతని ఆత్మకు శాంతిని కలుగజేయుట నీ ధర్మము. దానికి నీవు సంకోచించినట్లైతే నేనే ముందుకు వచ్చి ఆ కార్యమును ముగించెదను. నీ మూలంగా నీ సహోదరుడు నాకు కూడా సహోదరుడే కదా?" అన్నాడు రాముడు.

అప్పుడే అచ్చటకు వచ్చిన లంకానగర పట్టపురాణి మండోదరి తన భర్త శవముపై పడి రోదించి ఈ విధంగా పలికింది.

"రాముడు అనబడు ఒక మానవుని అంబు, శ్వేతవర్ణపు పుష్పములను ధరించి, జటముడులుండు పరమేశ్వరుడు అమరియుండు కైలాసపర్వతమును పెకళించి వేసిన రావణుని అందమైన మేనియంతయూ నువ్వుగింజ నిలబడడానికి కూడా స్థలములేని విధమున ఆతని ప్రాణములుండు స్థలమును వెదకి చిల్లుపరచిన విధమో? లేక అమృతముండు పుష్పములను ధరించు కురులుగల సీతయొక్క హృదయమనబడు చెరసాలలో దాగియున్న ప్రేమ, లోపల ఎక్కడైనా దాచబడియున్నదా అని ఆతని శరీరమంతటా వెదకుటకై ఇలా ఛిన్నాభిన్నము గావింపబడిందా?"

"ఎవరీ మాతృమూర్తి?" అని ప్రశ్నించిన రామునితో విభీషణుడు "ఆమె నా వదినగారు, మండోదరి" అని బదులిచ్చాడు. ఆ పిదప విభీషణుడు అన్నగారికి చేయవలసిన అంతిమ సంస్కారములనన్నింటినీ చేసి ముగించాడు.

- సశేషం

***చిత్తచలతి సంసారో, నిశ్చలే మోక్ష ఉచ్యతే! మనశ్చాంచల్యమే సమస్త సంసార బంధాలకు మూలము. నిర్మలమైన మనస్సును పరమాత్మ యందే స్థిరపరచుకోవడం అత్యంతావశ్యకము. మనస్సు నిలకడగా వున్నప్పుడే మోక్షాన్ని సాధించుకోవడం సాధ్యమవుతుంది.***

- శ్రీ కాళీబాబు

(గత సంచిక తరువాయి) **శ్రీ గురుగీతా** -కీ.శే డా॥వి.వి. ప్రసాదరావు

## అథ ప్రథమోధ్యాయః

**శరీర మింద్రియం ప్రాణ మర్ధ స్వజన బాంధవాన్**
**ఆత్మదారాదికం సర్వం సద్గురుభ్యో నివేదయేత్. 52**

**పదవిభాగము** :-

శరీరం-ఇంద్రియం-ప్రాణం-అర్ధ-స్వజన-స్వబాంధవో-ఆత్మదారాదికం -సర్వం-సద్గురుభ్యః-నివేదయేత్.

**టీక** :- శరీరం=దేహమును;ఇంద్రియం=ఇంద్రియములను; ప్రాణం =ప్రాణమును; అర్ధ=ధనమును; స్వజనబాంధవో=సేవక, బాంధవాదులను; ఆత్మదారాదికం=తన భార్యను, సంతానమును; సర్వం=సర్వస్వమును; సద్గురుభ్యః=సద్గురు దేవుని కొరకు; నివేదయేత్= సమర్పించవలెను.

**వ్యాఖ్య** :- "శరీరేంద్రియ ప్రాణములు, సంపదలు, సేవకులు, బంధువులు, దారాపుత్రులు మొదలైన తన సర్వస్వమును గురుదేవునికి సమర్పించవలెను" అని శిష్యునకు విధిస్తున్నాడు స్వామి. కేవల తను మనముల గురుదేవుని కర్పించటంతో శిష్యునికి బాధ్యత తీరిపోదు. 'నా దేహము' 'నా మనస్సు' అన్నట్లుగానే 'నాధనము, నా సేవకులు, నా బంధువులు, నా భార్యాపుత్రులు' అనెడు 'నా' అను అహంకారమడ్డు వస్తూ వుంటుంది. 'ఇది ఏదీ నాది కాదు అన్నీ నీవు ప్రసాదించినవే-వీటిని నీ సేవకై సమర్పిస్తున్నానని" సర్వ సమర్పణా భావంతో వర్తించినప్పుడే బ్రహ్మమునకు జీవునకు అడ్డుగా వున్న మాయ తొలగుతుంది. మనసే మాయ. 'నా' అనే భావం మానసికం, మమత జీవసృష్టి. ఈ జీవసృష్టిని తొలగించుకుంటే ఈశ్వర సృష్టియైన జగత్తు ప్రమాదకారికాదు. వీటన్నిటినీ యిచ్చిన గురుదేవుడు వాటిని మరల ఏమి చేసుకుంటాడు? ఇటువంటి వాటినన్నిటినీ త్యజించియే గదా బ్రహ్మమయుడైనాడాయన? కనుక శిష్యుని వైరాగ్యమును చూచి సంతసించిన గురువు శిష్యుని పాలిటి కామధేనువు, కల్పవృక్షము అవుతాడు.

**గురు రేకో జగత్సర్వం బ్రహ్మా విష్ణు శివాత్మనమ్**
**గురోః పరతరం నాస్తి తస్మాత్సం పూజయేద్గురుమ్. 53**

**పదవిభాగము** :-

గురుః-ఏకః-జగత్సర్వం-బ్రహ్మా-విష్ణు-శివాత్మకమ్-గురోః-పరతరం నాస్తి-తస్మాత్-సంపూజయేత్-గురుః

**టీక** :- బ్రహ్మావిష్ణు శివాత్మకం= బ్రహ్మా, విష్ణు, శివ స్వరూపమైన; జగత్సర్వం=ఈ ప్రపంచ మంతయు; గురురేకః=కేవలము గురు స్వరూపమే అయివున్నది; గురోఃపరతరం=గురువు కన్న శ్రేష్ఠమైనది; నాస్తి=లేదు; తస్మాత్=అందుచేత; గురుం=గురుదేవుని; సంపూజయేత్=చక్కగా సేవింపవలెను.

**వ్యాఖ్య** :- " సర్వోపనిషత్తులనెడు రత్నములచే విరాజిల్లుచున్న పాదపద్మములు గలవాడు, వేదాంతార్థ బోధకుడు నగుటచేత సద్గురు దేవుని చక్కగా పూజింపవలె"నని ప్రబోధిస్తున్నాడు పరమేశ్వరుడు. బ్రహ్మము ప్రత్యక్షానుమాన ప్రమాణములకందనిది. ఏ కొంచెమైనను చెప్పగలిగినది తృతీయ ప్రమాణమైన వేదమే. ఆ వేద శిరస్సులు ఉపనిషత్తులు. అవి నిగూఢము, గహనమునైన అర్థము కల్గినవి, వానికి భాషాపరముగ అనేకార్థములు చెప్పవచ్చును, కాని సరియైన అర్థము సమర్థుడైన ఆచార్యుని వలననే పొందవలెను. అట్టి సమర్థుడైన ప్రవక్తయే గురుదేవుడు. అందుచేత గురుదేవుని చక్కగా పూజింపవలెనని విధిస్తున్నాడు పరమశివుడు. పరమశివుడే తొలిగురువైన సదాశివుడు. అందుచేతనే మనము "సదాశివ సమారంభాం" అని గురు పరంపర చెప్పకుంటాము. సద్గురుదేవుని ఎలా పూజించవలెనో పరంపరకు ఆది పురుషుడైన సద్గురు దేవుడు వచించినది గనుక ఈ శ్లోకమున విధింపబడిన సంపూజనము అవశ్య శిరోధార్యము.

- సశేషం

(గత సంచిక తరువాయి) **గురుకృప** కీ.శే.- వై. లక్ష్మీనరసమ్మ

నీ దృష్టిబడం ధ్వజిప వెటులం బోనీవు, ప్రేమించి, సుజ్ఞానం జీగల సత్యమూర్తివి కదా కాశీప్రసాద ప్రభూ" అన్న రీతిన కాశీ భర్తకి (సుబ్రహ్మణ్యం) కూడా పెళ్ళికిముందే శ్రీబాబు దర్శనం కలిగింది. ప్రప్రథమంగా 1967సం. కొత్తపేటలో ఆయన చదువుతున్న హైస్కూల్‌కి శ్రీబాబు రావడంతో సుబ్రహ్మణ్యంగారికి దర్శనభాగ్యం కలిగింది. తరువాత 1972సం.లో పని మీద ఏలూరులోని జూట్‌మిల్స్‌కి వెళ్ళినప్పుడు రైల్వేస్టేషన్లో పర్సు పోగొట్టుకొని, "ప్రయాణం ఎలాగా?!" ఆలోచిస్తుంటే శ్రీబాబు సరిగ్గా అదే ప్లాటుఫామ్‌పై ఉండి ఆయనను చూసి "ఇలా రా" అని పిలిచి "ఎక్కడికి వెళ్ళాలి?" అని అడిగి పక్కనే వున్న వాళ్ళను పిలిచి టికెట్ తీసి ఇప్పించి "వెళ్ళిరా పని అయిపోతుందిలే" అని దీవించి పంపారు.

సుబ్రహ్మణ్యంగారు ఇప్పటికీ కూడా అమ్మ వాళ్ళ దగ్గర ప్రాంతానికి వచ్చారని తెలిస్తే వెళ్ళి దర్శనం చేసుకుంటూ ఉంటున్నారు. శ్రీఅమ్మ ఒకసారి సుబ్రహ్మణ్యంగారితో "నీకు ఏమైనా కోరిక ఉందా?!" అని అడిగితే "మీ దయ ఉంటే చాలు అమ్మ, నాకు ఏం కోరికలు లేవు, ఏ లోటు లేదు" అన్నారు. ఇప్పటికీ "అమ్మ దర్శనం, చిరునవ్వుతో పలకరిస్తే చాలు, అదే నాకు తృప్తి" అంటారు. రూపాలు వేరైనా శివ కేశవులకు భేదం లేనట్లు "శ్రీబాబే అమ్మ, అమ్మే బాబు." సర్వకాల సర్వావస్థలయందు కూడా శ్రీగురుదేవుల అపార కరుణాకటాక్ష వీక్షణాలు ఆయన పాద పద్మాలను నమ్మిన వారిపై ఎల్లప్పుడూ వర్షిస్తూ ఉంటాయి.

శ్రీమతి కాశీ శ్రీబాబు గురించి ఇలా పద్య రూపాన రాసుకున్నారు, (ఏప్రియల్,1986 సంవత్సరం సమర్థ సద్గురులో నా భావన అనే శీర్షికన ప్రచురించబడినవి)

నా భావన

గతయుగములందు రామకృష్ణు నెరుగను
గాని,ఈయుగనందు వారిర్వురు నొక
డై నవతరించి నట్టి సద్గురుని కన్ను
లార గాంచితి నాజన్మ పుణ్యమేమొ

భక్తుల వ్యవహారముల్ చర్చచేయు
రాముడే నీవు, వేరువేరు స్థలముల
యందు నొక్కటే సమయాన వుండు నీవు
కృష్ణుడవు, మరి రామకృష్ణుడవు కాదె

నాటి కృష్ణలీలలు గాంచలేదని విల
పించుటన్ మాని నేటి సాకార కాళీ
కృష్ణలీలల్ కరువు తీరగాంచి చిత్త
శాంతి నొందగదె మనసా చింతఏల?

కలియుగమిదని కలిమాయ తప్పించువా
రెవరని మతిమాలి వగచు టేల
సర్వ కలుష హరుడగు సద్గురుమూర్తి అం
డ మనకుండ మాయ ఎట్లు వచ్చు

సర్వ తీర్థ స్వరూపుడై నట్టి బాబు
వాసమైన కాళీనగరంబె పూర్ణ
పుణ్యభూమి, పాలకడలి వెండికొండ
నదియె, నింక నితర తీర్థ మేలమాకు?

నీకథను రాయ వాల్మీకిగాను, కృష్ణ
లీల తెలుప భక్తపోతనను గాను,
నేమీ గానని కినుక వహింపక, నొక
రేణువై నీపదముల వుండ వరమీవ!

శాస్త్రవాసన లేదు అయినను విషయ
వాసనలను, అజ్ఞానాంధ కారమునున్ ర
హితమొనర్చునది “గురు” నామమె, నిహపర
మదియె కాద, శాస్త్ర పఠన మేల నింక?

- సశేషం

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## గుంటూరు భక్తులతో శ్రీబాబు

(గత సంచిక తరువాయి)

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

### శ్రీశైల యాత్రలు

1961 లో కార్తీక పూర్ణిమ (వ్యాస పూర్ణిమ) సందర్భంగా శ్రీ బాబు భక్త బృందంతో సహా బయల్దేరి శ్రీశైలం వెళ్ళారు. మనతో మనస్సు విప్పి మాట్లాడి, మన మనస్సులను హరించే మల్లికార్జున స్వామి శ్రీ బాబు. వారే భక్తులను వెంటబెట్టుకొని శ్రీశైల మల్లికార్జున, భ్రమరాంబాదేవి దర్శనానికి తీసుకుని వెళ్ళారు అంటే, అలా వెళ్ళిన వారి భాగ్యమేమని వర్ణించగలము? తండ్రి తన బిడ్డలను వెంట బెట్టుకుని తమ యింటికి తీసుకుని వెళ్ళటమన్నమాట.



బహుళ పాడ్యమి నాడు శ్రీ మల్లికార్జున స్వామికి సహస్ర ఘటాభిషేకం జరిగింది. ఆ రోజు ఆ మహా క్షేత్రానికి విచ్చేసిన భక్తులందరి దర్శనాది కార్యక్రమములను ఆలయ నిర్వహణాధికారులు మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిపి, ఆ తరువాత అభిషేక, పూజా కార్యక్రమమును శ్రీ బాబుకు వారి భక్త బృందానికి ప్రత్యేకించారు.

శ్రీ బాబు శ్రీ మల్లికార్జున స్వామి సన్నిధికి వెళ్ళి ఆసీనులయ్యారు. మహన్యాస పారాయణ అనంతరము, శ్రీ బాబు పంచామృతాభిషేకములు, నవరసాభిషేకములు జరిపారు. అనంతరము సహస్ర ఘటాభిషేకం ప్రారంభమైంది.

భక్తులందరు వరుసగా సరస్వతీ తీర్థము నుండి స్వామి సన్నిధి వరకు నిలబడి, ఒక్కొక్క బిందెను కొలనులోని నీళ్ళతో నింపి వరుసగా అందుకుంటూ శ్రీ బాబుకు అందజేసేవారు. శ్రీ బాబు ఆ నీరు స్వామికి అభిషేకించి అందించిన ఖాళీ బిందెను మరొక వరుసలో నిలబడి భక్తులు కొలను వరకు చేర్చేవారు.

శ్రీ స్వామి సన్నిధిలో ఆశీనులైనప్పటి నుండి శ్రీ బాబు తమ దృష్టిని స్వామిపైనే నిలిపి, ఆత్మావలోకనం చేసుకుంటూ, బిందెలను అందుకొని అభిషేకం చేశారు. మృత్యుంజయుడు రెండు చేతులలోను, రెండు అమృత కలశములు తీసుకొని స్వయంగా తనకు తానే అభిషేకం చేసుకుంటున్న మహత్తర దృశ్యం అక్కడ గోచరమైంది. రుద్ర నమక చమకములు 121 సార్లు పఠిస్తుండగా, స్వామికి సహస్రాధిక ఘటములతో మహా రుద్రాభిషేకం జరిగింది. "ఓం నమశ్శివాయ" అనే పంచాక్షరీ మహామంత్ర నినాదంతో

ఆలయం ప్రతిధ్వనిస్తుండగా అభిషేకం ముగిసింది. శ్రీ బాబు స్వహస్తాలతో స్వామిని చక్కగా తుడిచి, అలంకరించుకున్నారు.

ఆ కార్యక్రమమంతా తన్మయులై తిలకించిన ఆలయ అర్చకులు "శ్రీ మల్లికార్జున స్వామి వారే స్వయంగా వచ్చి తమను తాము అభిషేకించుకున్న యీ దివ్యానుభూతి లభించటం మా భాగ్యము" అని శ్రీబాబుకు ప్రణామములర్పించారు.

ఆ మరునాడు జరిగిన లక్షబిల్వార్చనలో శ్రీ బాబు తాము బిల్వాలతో స్వామిని పూజిస్తూ, భక్తులందరిచేత పూజ చేయించారు. నివేదన, మహా మంగళ హారతి, మహా మంత్రపుష్పం అయిన తరువాత భక్తులందరికి శ్రీ బాబు తీర్థమిచ్చారు. ఆ రాత్రి శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వాముల లీలా కళ్యాణ మహోత్సవమును శ్రీ బాబు సన్నిధిలో భక్తులు జరుపుకున్నారు.

కళ్యాణం జరిపించిన ఆరాధ్యుల వారు శైవాగమంలో నిష్ణాతులు. వారు శ్రీ బాబుకు సాష్టాంగ వందనం చేసి "నా ప్రియతమ దైవమైన పరమశివుని తమలో దర్శించుకుంటున్నాను. నా జన్మ ధన్యమైనది " అన్నారు.

మరునాడు శ్రీ బాబు భక్తులందరితోను కలిసి శ్రీ భ్రమరాంబా దేవికి లక్ష కుంకుమార్చన చేశారు.

శ్రీశైలంలో శ్రీ బాబు భక్తులందరితోను వారం పది రోజులు గడిపారు. ప్రతిరోజు బసలో భక్తులందరు ప్రాతస్సాయంసంధ్య వేళలలో ప్రార్థన చేసుకునే వారు. సంకీర్తన జరిగేది. శ్రీ బాబు తమ ఉదయ, సాయంకాల పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలిచ్చేవారు. రాత్రి సత్సంగ సమావేశములు జరిగేవి. శ్రీ బాబు తమ దివ్య బోధామృతమును భక్తులందరికి అందజేసేవారు. ఆయా సమయాలలో శ్రీ బాబుతో వచ్చిన భక్తులే గాక ఎందరెందరో ఇతర ప్రదేశాల నుండి వచ్చిన భక్తులు శ్రీ బాబు అనుగ్రహ భాషణమును వినటానికి ఆ సమావేశాలకు వచ్చేవారు.

పగలు విరామ సమయాలలో శ్రీ బాబు భక్తులందరిని వెంట బెట్టుకొని శ్రీశైలంలోని దర్శనీయ స్థలములను, యితర దేవాలయములను, ఆ దివ్య క్షేత్రములో మహర్షులు, దేవతలు తపమాచరించిన పవిత్ర స్థలములను చూపి వాటి పురాణ ప్రాశస్త్యాలను వివరించేవారు. అవకాశం లభించినప్పుడల్లా భక్తులు పాతాళగంగకు వెళ్ళి కృష్ణానదిలో స్నానం చేసేవారు.

- సశేషం

# ఆధారం

- పాలూరి ప్రసాద్

ఈ సమస్త సృష్టికి ఆధారం భగవంతుడే అని మనందరికీ తెలిసిందే కదా. దానినే గీతలో స్వామి **మత్తః పరతరం నాన్యత్ కించిదస్తి ధనంజయ। మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ॥** – నాకంటే వేరుగా ఏదీ లేదు. ఈ సృష్టి సమస్తం మణిమాలలోని దారానికి మణులు అల్లుకున్న విధంగా నాతో అల్లుకుని ఉన్నది అని చెప్పారు. అయితే ఈ సృష్టి అనే మణిమాలకు ఆధారమైన దారం ఆ పరమాత్మే అయినా ఈ మాలలోని మణులన్నీ కూడా పరస్పరం ఆధారితమై ఉన్నాయి. చివరికి ఎంతో ఉన్నత స్థితిలో వున్న దేవతలు కూడా మనం యజ్ఞాలలో ఇచ్చే హవిస్సులపై ఆధారపడి ఉన్నారు.



**సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః।**
**అనేన ప్రసవిష్యధ్వమేష వోఽస్త్విష్టకామధుక్॥**
**దేవాన్ భావయతానేన తే దేవా భావయంతు వః।**
**పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథ॥**
**ఇష్టాన్ భోగాన్ హి వో దేవా దాస్యంతే యజ్ఞభావితాః।**
**తైర్దత్తానప్రదాయైభ్యో యో భుంక్తే స్తేన ఏవ సః॥**

మొదలైన భగవద్గీతా శ్లోకాలలో పరమాత్మ దీనినే వివరిస్తున్నాడు. "బ్రహ్మదేవుడు ప్రజలను సృష్టించినప్పుడే వారితోపాటు యజ్ఞాలను సృష్టించి ఇవి మీ కోరికలన్నీ తీరడానికి ఉపయోగపడతాయి. ఈ యజ్ఞాలతో మీరు దేవతలను తృప్తి పరిస్తే వారు మీరు కోరిన సంపదలన్నీ అనుగ్రహిస్తారు. ఇలా మీరు పరస్పరం ఆధారితులై పరమమైన శ్రేయస్సును పొందండి. అయితే ఒక విషయం గుర్తుంచుకోండి. దేవతలు మీకు అనుగ్రహించిన భోగాలను ఇతరులతో పంచుకొని అనుభవించండి. లేకపోతే మీరు దొంగలుగా పరిగణించబడతారు" అని చెబుతున్నాడు.

అలాగే మంత్రపుష్పంలో నీటిని వస్తువుగా తీసుకొని సృష్టి అంతా పరస్పరం ఆధారితమై ఎలా ఉందో వివరించారు. అగ్ని, వాయువు, తపస్సు, చంద్రుడు, నక్షత్రాలు, మేఘాలు, ఋతువులు(సంవత్సరం) ఇవన్నీ జలానికి ఆధారమని, అలాగే జలం వీటికి ఆధారమని, ఇలా పరస్పర ఆధారమనే విషయాన్ని గ్రహించినవాడు నిజంగా ఆధారం కలవాడని వివరించారు. అయితే మనలో కొందరు ఈ విషయాన్ని గ్రహించలేక "నేను ఎవరిమీదా ఆధారపడను. నా పనులన్నీ నేనే చేసుకుంటున్నాను కదా. ఇంకెవరిమీద ఆధార పడవలసిన అవసరం నాకేంటి?" అనుకుంటారు. ఇంకొందరు ఇంకొక అడుగు

ముందుకు వేసి "నా జేబు నిండా డబ్బులు ఉన్నాయి. ఏ పనైనా డబ్బులు పడేసి నేను చేయించుకోగలను. కాబట్టి నేను ఎవరిమీదా ఆధారపడటం లేదు" అని భావిస్తారు. ఇటువంటి దంభాన్ని, దర్పాన్ని, అజ్ఞానంతో కూడిన ఆభిజాత్యాన్ని పరమాత్మ గీతలో అసుర సంపదగా నిర్వచించాడు.

నిజానికి సృష్టిలోని ఏ ప్రాణికి ఎవరిమీదా ఆధారపడకుండా జీవించడం సాధ్యం కాదు. మన ఇల్లు అంతా మనం ఒక్కరమే మన చేతులతో నిర్మించుకొని, మన బట్టలు మనమే నేసుకొని, మన పంటలు మనమే పండించుకొని, వండుకొని తినడం సాధ్యమా? ఒకవేళ ఎవరైనా ఈ విద్యలన్నీ నేర్చుకున్నా అన్నీ తానే చేయాలంటే రోజు సరిపోదు, ఒక జీవితం సరిపోదు. ఒకవేళ కష్టపడి చేసుకున్నా, వీటన్నిటికీ కావలసిన ముడిసరుకులు, పనిముట్లు అనేకం ఉంటాయి కదా. వాటినయినా ఇతరుల వద్ద నుండి సేకరించవలసిందే కదా. అయితే మానవుని ఆలోచన ఎలా ఉంటుందంటే దీనిని ఇతరులమీద ఆధారపడటంగా భావించడు. కేవలం డబ్బులు ఇచ్చి సేవలు పొందటం అనే ఒక వ్యాపారంగా చూస్తాడు. ఇది అహంకారానికి దారితీసి సాటి మనిషిని కనీసం మనిషిలా చూసే సంస్కారాన్ని కూడా నశింపజేస్తుంది.

మనిషికి ఆత్మాభిమానం ఉండటం, ఎవరిదగ్గరా ఏమీ తీసుకోకూడదు అనే అపరిగ్రహం ఉండటం మంచిదే. కానీ ఆత్మాభిమానానికి, అహంకారానికి మధ్యలో చాలా సన్నని గీత ఉంటుంది. దానిని గుర్తించడం కష్టం. కేవలం ఆత్మాభిమానం మాత్రమే ఉన్నవాడు తనకు ఎంత అభిమానం ఉంటుందో ఎదుటి వ్యక్తికి కూడా అంతే అభిమానం ఉంటుంది అని గుర్తిస్తాడు. అలాకాక అహంకారం ఉన్నవాడు ఎంతసేపూ "నేనే అందరికీ పెట్టాలి. నేనే అందరినీ పోషించాలి. నేను ఇచ్చినవన్నీ అందరూ నోరు మూసుకుని తీసుకోవాలి. కానీ నేను మాత్రం ఎవరి దగ్గరా ఏమీ తీసుకోకూడదు. ఒకవేళ తీసుకోవలసి వస్తే వెంటనే అంతకన్నా విలువైనది వాళ్ళకి ఇచ్చేయాలి" ఇలా ఆలోచిస్తాడు.

మనకి అనేక వ్రతాలు, నోములు, ఇతర పుణ్యకార్యాలు నిర్ణయించిన పెద్దలు వాటిలో భాగంగా సమాజంలోని ఇతరులను ఆహ్వానించి వారికి మన శక్తికొలది వాయనాలు, తాంబూలాలు, వస్త్రాలు ఇచ్చే ఏర్పాటు చేశారు. అయితే ఇక్కడ ఇచ్చేవారు, పుచ్చుకొనే వారిని తాము అప్పటిదాకా ఏ దేవతను ఆరాధించారో ఆ దేవతా స్వరూపంగా భావించి భక్తితో ఇవ్వాలి. అలాగే పుచ్చుకొనేవారు కూడా ఆ వస్తువును ఆ దేవత ప్రసాదంగా భావించి భక్తితో స్వీకరించాలి. అలా కాకుండా "ఫలానా వారు నాకు వాళ్ళ ఇంట్లో వ్రతానికి వెయ్యి రూపాయల చీర పెట్టారు. నేను వెంటనే మరొక వ్రతం చేసుకొని వారికి పదిహేను వందలదో రెండు వేలదో చీర పెట్టేయకపోతే నేను వారికి ఋణపడిపోతాను. ఇది నా ఆత్మాభిమానానికే కళంకం" అని భావిస్తే ఇక అక్కడ అహంకారం, వ్యాపారం తప్ప భక్తి ఎక్కడ ఉంది?

చిన్న వయసులో పిల్లలు తల్లిదండ్రుల మీద ఆధారపడటం ఎంత సహజమో పెద్ద వయసులో అదే తల్లిదండ్రులు ఆ పిల్లలమీద ఆధారపడటం అంతే సహజం. అది ప్రకృతి న్యాయం కూడా. అయితే "నా దగ్గర ఇంత ఆస్తి, ఇన్ని డబ్బులు ఉన్నాయి కాబట్టి ఏ వయసులో అయినా, అటు నా తల్లిదండ్రులయినా, ఇటు నా పిల్లలయినా నా మీదనే ఆధారపడాలి తప్ప నేను ఎవరి మీదా ఆధారపడను" అని అహంకరిస్తే ఎవరికి నష్టం? నిజానికి ఏ కుటుంబంలో సభ్యులు ఒకరిపై ఒకరు పరస్పరం ఆధారపడి ఉంటారో ఆ కుటుంబంలోనే ప్రేమ, ఆప్యాయతలు, సుఖశాంతులు వెల్లివిరుస్తాయి. అలా కాకుండా ఏ ఒక్క కుటుంబ సభ్యుడయినా "నేను సర్వస్వతంత్రుడిని, ఎవరిమీదా ఆధారపడను, ఎవరితోనూ సంప్రదించను, ఎవరికీ సమాధానం చెప్పను" అని అహంకరించి ఒంటెత్తు పోకడలతో ప్రవర్తిస్తే ఆ కుటుంబంలో నిరంతరం అశాంతి, అల్లకల్లోలం చెలరేగి చివరికి విచ్ఛిన్నం అయిపోతుంది కదా!

మళ్ళీ మనం మన మొదటి మణిమాల వద్దకే వెళితే అందులోని మణులన్నీ 'మాకందరికీ దారమే ఆధారమై ఉంది కనుక మేము పరస్పరం ఆధారపడం' అని అహంకరించి ఒకదానికొకటి దూరంగా ఉన్నాయనుకోండి ఆ మాల ఏమి అందంగా ఉంటుంది? అదే ఒకదానికొకటి దగ్గరగా అల్లుకొని అన్నీ కలసిమెలసి ఉంటే అది మణిమాల అయినా, పూలమాల అయినా ఎంతో అందంగా ఉంటుంది. నిజానికి భగవంతుడు మనందరికీ ఆధారం మాత్రమే కాదు. మనందరం ఆయన విరాట్ శరీరంలో భాగాలమే. ఒక శరీరంలో భాగాలన్నీ ఒకదానిపై ఒకటి ఆధారపడి పరస్పర సహకారంతో ప్రవర్తిస్తే ఆ శరీరం ఆరోగ్యంగా ఉంటుందా? లేక దేనికదే అహంకరించి మిగిలిన వాటితో సంబంధం లేకుండా ప్రవర్తిస్తే ఆరోగ్యంగా ఉంటుందా? అది అనారోగ్యమే కదా!

తమ శిష్యులు ఎవరైనా ఇద్దరి మధ్యలో భేదాభిప్రాయాలు వచ్చి ఒకరిమీద ఒకరు నెపం మోపుతూ తమ వద్దకు వస్తే వారికి శ్రీగురుదేవులు ఇదే చెప్పేవారు. "నా రెండు చేతులు ఒకదానితో ఒకటి కలహించుకొని తీర్పుకి నా దగ్గరకు వస్తే నేను ఏమి చెయ్యాలి? ఏ చెయ్యి పక్షాన నిలవాలి?" అని ప్రశ్నించేవారు. కాబట్టి మనందరికీ భగవంతుడు ఆధారం అన్నది ఎంత నిజమో మనందరం పరస్పర ఆధారితులమన్నది కూడా అంతే నిజం. దీనిని గ్రహించిననాడు అహంకారం తలెత్తకుండా ప్రతి జీవిలోనూ పరమాత్మను దర్శించి గౌరవించే ఉత్తమ సంస్కారం అలవడుతుంది. ఇటువంటి మంచి సంస్కారాలను చిన్నవయసులోనే అలవరచుకోవాలి కానీ వయసు మళ్ళిన తరువాత సుదీర్ఘ జీవితంలో మనను అంటిపెట్టుకొని ఉన్న కుసంస్కారాలు వదుల్చుకోవాలంటే అంత సులభం కాదు.

## విష్ణు  కథలు

-రమణ ప్రసాద్

(గత సంచిక తరువాయి)

# త్రైలింగ స్వామి

మర్నాడు నేను త్రైలింగస్వామి దర్శనానికి వెళ్ళాను. వారికి నమస్కరించి ఒక స్తంభానికి ఆనుకొని వారి దివ్య స్వరూపాన్ని చూస్తూ ఉండిపోయాను. పునర్జన్మ గురించి నాకు కలిగిన సందేహాన్ని వారిని అడిగి నివృత్తి చేసుకోవాలనుకున్నాను. నేను ఏమి మాట్లాడకముందే సైగ చేసి నన్ను వెళ్ళిపొమ్మన్నారు. ఆయనకు సేవచేసే మంగళదాస్ నన్ను వెళ్ళిపొమ్మన్నాడు. ఆ మధ్యాహ్నం వెళ్ళాను. మళ్ళీ వెళ్ళిపొమ్మన్నారు.



మర్నాడు వెళ్ళి అదే స్థానంలో నిలబడ్డాను. స్వామి వెళ్ళిపొమ్మన్నారు. మంగళదాస్ వచ్చి నన్ను త్వరగా వెళ్ళమనటం జరిగింది. ఇలా 12 రోజులు జరిగింది.

13వ రోజు ఉదయం ఆశ్రమానికి వెళ్ళి, దుఃఖం ఆపుకోలేక ఏడవటం మొదలుపెట్టాను. అది చూసి స్వామివారు కూర్చోమని చెప్పారు. నేను వారి పాదాలు పట్టుకుని వెక్కివెక్కి ఏడ్చాను. ఆయన మంగళదాస్‌ని పిలచి "రేపు ఉదయం రమ్మని" చెప్పమని సైగ చేశారు.

14వ రోజున ఉత్సాహంగా ఆశ్రమానికి వెళ్ళి స్వామివారికి సాష్టాంగ ప్రణామం చేసి వారి పాదధూళిని శరీరానికి రాసుకుని వారి సమీపంలో కూర్చున్నాను. నాలో నిర్వేదం పోయి ఆయన చెంత ఎంతో ఆనందంగా ఉంది. ఇంతలో మంగళదాస్ వచ్చి ఒక గంధపు చెక్క ఇచ్చి స్వామివారు గంధం తీయమన్నారు అన్నాడు. రెండు ఝాములు గంధం తీశాను. స్వామివారు భోజనం చేసి రమ్మన్నారు. వచ్చాక మళ్ళా గంధం తీయమన్నారు. కొంతసేపటికి ఒక బహ్మచారిని పిలిచి ఒక కాగితం అతనికి ఇచ్చి, అతని చేత ఆ గంధంతో వాకిలి గోడమీద దేవనాగరి లిపితో ఏదో వ్రాయించమన్నారు. సాయంకాలం నన్ను ఇంటికి వెళ్ళిపొమ్మన్నారు.

15వ రోజున ఇలాగే జరిగింది. ఇలా 28 రోజులు గడిచాయి. ఈ రోజు కూడా గంధం తీయమంటే "నాకు చేతకాదు అందామని" అనిపించింది. గంధం తీయకపోతే పంపించివేస్తారేమో అని మనస్సు కలత చెంది కన్నీళ్ళు ప్రహిస్తున్నాయి. స్వామివారు

నేను దేవనాగరి లిపి చదవగలనో లేదో అని మంగళదాస్ చేత అడిగించారు. “నేను చదవగలను” అనగానే గొంగళి క్రింద ఉన్న ఒక తాటాకు గ్రంథాన్ని ఇచ్చి అందులో ఉన్న శ్లోకాలను బెంగాలీ భాషలో అనువదించమన్నారు. 5 రోజులలో ఆ పని పూర్తి చేశాను. స్వామివారు వాటిని చదివి వినిపించమన్నారు. వాటిని వినిపించిన తరవాత తాము ఇచ్చిన తాటాకు గ్రంథం తీసుకుని గొంగళి క్రింద పెట్టి మరొక తాటాకు గ్రంథాన్ని ఇచ్చి అందులోని శ్లోకాలను అనువదించమన్నారు. 3 రోజులలో నేను అనువాదం చేసి చదివి వినిపించాక తాము ఇచ్చిన తాటాకు గ్రంథం తీసుకుని గొంగళి క్రింద పెట్టి ఇంటికి వెళ్ళి భోజనం చెయ్యమన్నారు. భోజనం చేసి వచ్చి కూర్చున్నాను. ఆయన నన్ను చూస్తూ పడుకున్నారు. నేను ఆయన పాదసేవ చేయసాగాను. సాయంత్రం వారు లేచి మర్నాడు సాయంత్రం రమ్మని సంజ్ఞ చేశారు.

నేను వెళ్ళి స్వామివారి ఆశ్రమంలో ఉన్న పెద్ద మహదేవ మూర్తిని, కాళీమాతను దర్శించి హారతులు తీసుకుని వారి దగ్గరకు వచ్చి కూర్చున్నాను. స్వామీజీ నన్ను ఒక చిన్న గదిలోకి తీసుకు వెళ్ళారు. అందులోకి ఎవ్వరూ రాకూడదని కట్టడి చేశారు. ఆ గదిలో ఒక ఆసనం ఉంది. అక్కడ ఒక దీపం వెలుగుతోంది. స్వామివారు ఆ ఆసనం మీద కూర్చున్నారు. “నీవు దేనిని మనస్సులో పెట్టుకొని వచ్చి దాని సమాధానం కోసం ఇక్కడికి వచ్చావో దానిని గురించి ఇంత సందేహం ఎందుకు? త్రికాల దర్శులు, ఆత్మ తత్త్వజ్ఞులు, మహర్షులు వారి తపోబలంతో చేసిన సిద్ధాంతాలను గురించి నీవు సందేహించనక్కర్లేదు. వారు చెప్పింది సత్యం. మానవుడు తాను చేసిన సుకృతాలు, దుష్కృతాల అనుగుణంగా జన్మ ఎత్తుతూ ఉంటాడు. పునర్జన్మ గురించి తెలుసుకోవాలని ఇన్ని కష్టాలు అనుభవించావు. నీకు చక్కగా అర్థమయేటట్లుగా చెబుతాను. మొదట నేను నీ జీవితంలో కొన్ని సంఘటనలు చెబుతాను. అవి సత్యమే అని నమ్మకం కుదిరితే నీకు నేను పునర్జన్మ గురించి చెప్పేది సత్యం అని నమ్ముతావు.”

- సశేషం

Printed & Published by Paluri Siva Rama Kaliprasad, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Nagendra Enterprises, 24-7-8, Sandeep Mansion, Jonnavittula Vari St.,Gandhi Nagar, Vijayawada-520003, N.T.R.Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

## యునైటెడ్ కింగ్‌డమ్‌లోని రీడింగ్‌నందున్న
## అమ్మన్ దేవాలయంలో జరిగిన సత్సంగ దృశ్యములు









REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on Fifth and Sixth of every month

RNI No. 37804/81
POSTAL REGD. No. : GTR/27/2024-26



ఆగష్టు 8న వడ్లమూడి నందు
శ్రీ దండి నిర్మలానందగిరివారి
సంకల్పంతో ప్రతిష్ఠింపబడిన
శ్రీ శివగురు మందిరము
ద్వితీయ వార్షికోత్సవంలో పాల్గొన్న
శ్రీ మాతాజీ





ఆగష్టు 15 నుండి 17 వరకు
గొట్టమంగళాపురంలో
జరిగిన శ్రీ రామలింగేశ్వరస్వామివారి
ఆలయ ప్రతిష్ఠా మహోత్సవంలో
పాల్గొన్న శ్రీ మాతాజీ

If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.